
# ఆంధ్రమహిళ





DECEMBER '56 ANDHRA MAHILA ANNAS 8


విశిష్ట
రకాల
చేనేత
వస్త్రాలు
ఉన్నాయి
ఆయావ్యక్తుల
అభిరుచులకూ
సందర్భాలకూ
తగినట్టి
ALL INDIA HANDLOOM BOARD
చేనేత
• వస్త్రాలు
నేతలో • రంగులలో • నాణ్యంలో
అమోఘమైనవి.
ఆలిండియా హేండ్‌లూం బోర్డు,
మదరాసు - బొంబాయి - కాన్పూరు.
DA-56/114

# ఆంధ్ర మహిళ

సంపుటి 13 :: డిశంబరు '56 :: సంచిక 12

ఈ సంచికలో పుటలు తగ్గించబడినవి. 1957 జనవరి ఆంధ్రమహిళ పదమూడవ వార్షిక సంచికగా చాలా ఎక్కువ పుటలతో ప్రచురించ బడునని విన్నవించు చున్నాము.—

—సం॥

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్.
సంపాదకురాలు.
శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్.
ముద్రణ :
ఆంధ్ర మహిళా ప్రెస్.

## విషయసూచిక

ముఖచిత్రం – ప్రధానినెహ్రూ



సంవత్సరచందా : ఆరు రూపాయలు.

ఆంధ్రమహిళ

సంపుటి 13 :: డిశంబరు 56 :: సంచిక 12

# తనకుమాలినధర్మము - మొదలుచెడ్డబేరము

కారుమబ్బులు క్రమ్ముకువచ్చినవి. యుద్ధజ్వాలలు ప్రజర్విల్లినవి. ఈజిప్టులో ఇస్రేయిల్, ఆంగ్లో ఫ్రెంచి సేనలు ప్రవేశించినవి. గాజాప్రాంతాన్ని ఆక్రమించుకొన్నవి. పోర్టుసెడ్ విధ్వంసము చేసినవి. సూయజ్ కెనాలు సుమారు మూడు నాలుగు నెలలవరకు నిరుపయోగము చేయునట్లు చేసినవి. ఈజిప్టు సూయెజ్ కెనాలుమీద హక్కు వదలనన్నది. అదివీలులేదని మిగిలిన దేశాలు కారణమేమి చెప్పినా యుద్ధానికి ఉపక్రమించారు. రష్యా, అమెరికాలు హూంకరించినవి. మూడవ ప్రపంచ యుద్ధము మనకగా కనిపించింది. ప్రపంచమంతా హడలిపోయింది. కాని వెంటనే క్రమ్ముకొన్న మబ్బులు పటాపంచలైపోయినవి. యుద్ధము ఆగిపోయినదని వార్తలు వచ్చినవి. దానితో ప్రపంచ మానవులందరు అమ్మ అని శాంతి పడ్డారు. ఏదో సంప్రదింపులతోనే సమస్యలు పరిష్కారము కాగలవని ఆశించారు. ఇప్పటికి సుమారు పది పదిహేను రోజులనుండి ఆ పరిష్కారమునకై ఎదురుచూస్తూండగా ఆ పరిష్కారము మాత్రము వెనుకబోవుచున్నట్లున్నది. రామాయణములో పిడకలవేటలాగు ఈ ఈజిప్టు సమస్యతో హంగరీ సమస్య ఒకటి తయారించింది. ఈ తగాదాలు ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయన్న భయము మినహా ఇప్పటి వివిధ రాజ్యాల వైఖరులు, తగాదాలు, వాదాలు చాలా వినోదంగా సంకురాత్రినాటి కోడిపందెముల వలే వున్నవి. రష్యా కాలుదువ్వుటయేమి, అమెరికా భుజము తట్టుట యేమి, ఈజిప్టు కెనాడాపాకిస్తానులను నిరాకరించుట ఏమి అన్నీ చాలా వినోదముగానే వున్నవి. ప్రస్తుతము హెమర్షీల్డు ఏమిచేస్తాడు? ఐక్యరాజ్యసమితి ఏమిచేయగలదు? ఆంగ్లోఫ్రెంచితంత్రమేమిటి? ఈజిప్టు ఏనిముషములో ఏపావును ఈయుద్ధచతురంగములో నడుపగలదో చెప్పలేము. కాని మొన్న శ్రీ నెహ్రూ చెప్పినట్టు ప్రపంచ యుద్ధభయములేదు అని చెప్పటానికిఇంకా వీలులేదు.

నిన్న శ్రీ అశోకమెహతా చెప్పినట్లు కాష్మీరుదృష్ట్యా హంగరీ విషయములో మనకు వేరే దారి లేదేమో! పర్యవసానము అన్నివివరాలు పరిశీలించి చూస్తే తనకు మాలిన ధర్మము మొదలుచెడ్డబేరము అన్న సూక్తియొక్క సత్యాన్నిగ్రహించి ప్రవర్తించుచున్నవని చెప్పకతప్పదు.

మానవులలో మానవత వున్నన్నాళ్ళు మరోవిధముగా మానవాళి ప్రవర్తింపజాలదు. కావున వివిధరాజ్యాలకుఅవసరమైన సూయజ్, జిబ్రాల్టర్ మొదలుకొగల ఇతరప్రదేశములన్నీ అంతర్జాతీయ ప్రాంతములుగా ఏర్పాటు చేయుటకు వివిధ రాజ్యాల రాజకీయవేత్తలు కృషిచేసి సఫలీకృతులైరేని, అప్పుడు జాతీయము చేసిన సూయజ్ కెనాల్ ప్రపంచానికి ఆదపలు తెచ్చే అవకాశములుండకపోవచ్చును. కావున ఈవిషయమున మన భారతదేశమే తన గౌరవ మర్యాదల వత్తిడితో ప్రపంచ సౌభాగ్యానికి ప్రయత్నము చేయగలదా?

లేదా ప్రపంచ యుద్ధము తప్పదు. శ్రీ నెహ్రూ చెప్పినట్లు ప్రపంచానికిప్పుడు రెండే మార్గాలు. పంచశీలో లేక అణ్వస్త్రాలో? ఈసారి ప్రపంచయుద్ధముతో ప్రపంచములోని సగము మానవులు వారి వారి ఇళ్లు, వాకిళ్లు, గ్రామాలూ నగరాలూ రూపు మాసిపోగలవు. కలియుగము సమాప్తమేమో! తరువాత శుభమో! అశుభమో ఎవరు చెప్పగలరు? చూడగలిగినవారు ధన్యులు.

---

# సాంధ్యశ్రీ

## రాజశ్రీ

అది సంధ్యారుణ మేఘకన్నియల
  రాగాలాపనామోద స
మ్మద దృశ్యమ్ము, విముగ్ధతారల లస
  న్మందస్మితానంద సం
పదవిన్యాసపు వింతపోకడ, సుధా
  ప్రాపంచ సంశోభ సొం
పొదవెన్ కమ్మగ, సృష్టి సర్వమిక
  రాగోల్లాస సమ్మోహమే

గాలి కెరటాల జలతారు మేలిముసుగు
మధుర కుసుమపరాగాల మాలలొసగు
అమృత భావపరంపర లాలపించు
ఆ మనోహర సంధ్యా కలాపమందు.

లలిత సంగీత రాగ సల్లాప భావ
మోహన విలాస నవరసామోద విశ్వ
ప్రణవ కల్యాణ మధుర నీరాజనాల
వెలుగు చీకటి లొకటిగా మిళితమాయె

తరల యామిని తత్వగీతాలు పాడె
పుడమి తమిదీర ఆశతో పొంగిపోయె
సకల నిర్మల రాగపిచికలు విరిసె
శాంతి లోకాన మందార కాంతి కురిసె.

---

# రాజకీయాలు

శ్రీ జొన్నలగడ్డ వేంకట రాధాకృష్ణయ్య

### కొత్త ఎన్నికలు

వచ్చే సంవత్సరం మార్చి నెల ఉత్తరార్థంలోనో, ఏప్రిల్ ప్రారంభంలోనో కొత్త ఎన్నికలు జరగవచ్చునని భారతప్రధాని పండిట్ జవాహర్‌లాల్ నెహ్రూ గత నెల 25వ తేదీని న్యూఢిల్లీలో ప్రకటించారు.

భారత స్వాతంత్ర్యసిద్ధికి పిమ్మట దేశంలో మూడవ సారిగా జరుగుతున్న ఈ ఎన్నికలు కొన్ని కొండ ప్రాంతాలలో తప్పితే ఒక్క రోజులో పూర్తి చెయ్యడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు కూడా.

### ఇథియోపియా చక్రవర్తి రాక

ఇథియోపియా చక్రవర్తి హెయిలీ సెలాసీ గత నెల 25వ తేదీని ఇండియా ప్రభుత్వం ఆహ్వానంపై మన దేశానికి వచ్చారు. ఆయన కుమార్తె, మనుమరాలు, ఇంకా పరివారం దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, ప్రాజెక్టు ప్రాంతాలు అన్నీ దర్శిస్తున్నారు.

### ఇండియన్ యూనియన్‌లో కాశ్మీర్ ప్రవేశం

కాశ్మీర్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో అవిభాజ్యమైన అంతర్భాగమైనట్లు, నిర్దేశిస్తున్న క్లాజును కాశ్మీర్ రాజ్యాంగసభ అక్టోబర్ 29వ తేదీని ధృవపరిచింది. ఆజాద్ కాశ్మీర్ కూడా ఇండియాలో అంతర్భాగమేనని ప్రకటించింది కూడా.

పాకిస్తాన్ ఎంత గోలుకొంటున్నా, కాశ్మీర్ ప్రభుత్వం తన విధినిహితాలను నెరవేర్చుకొంటూనే వుంది.

### కొత్త రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్ అవతరణ

నవంబర్ మొదటి తేదీన భారతదేశ చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభమయింది. మహారాష్ట్రంలో, గుజరాత్‌లో, బెంగాల్, బీహార్‌లలో, మద్రాసులో రాష్ట్ర పునర్విభజనపట్ల ఆక్షేపణలు, అల్లరులు, అరెస్టులు, కాల్పులు, సత్యాగ్రహోద్యమాలు, మొదలైనవి అనేకం సంభవించి, బీభత్స స్వరూపం ధరించిన పరిస్థితి శాంతించిన పిదప ఈ రోజున 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలు పునరవతరించాయి. అవి ఇవి:

ఆంధ్రప్రదేశ్, అస్సాం, బొంబాయి, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మదరాసు, ఒరిస్సా, మైసూరు, పంజాబ్, పశ్చిమ బెంగాల్, బీహార్, రాజస్థాన్, జమ్ము, కాశ్మీర్‌లు.

నవ్యాంధ్ర రాజధాని హైదరాబాదు నగరంలో శ్రీ నీలం సంజీవరెడ్డిగారు ముఖ్యమంత్రిగా కొత్త మంత్రివర్గం ఏర్పడింది. దీనిలో ఏడుగురు ఆంధ్ర ప్రతినిధులు అయిదుగురు తెలంగాణా ప్రతినిధులు వున్నారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణకు ఆధ్వర్యంవహించిన భారత ప్రధాని - ఈ మహోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన లక్షలాదిప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ అవతరణ పాతవ్యవస్థలకు స్వస్తి చెప్పి, కొత్త వ్యవస్థకు నాందిపలికే అతిప్రధాన సంఘటన అని పేర్కొన్నారు.

ఆంధ్ర తెలంగాణాల ప్రతినిధులు పరస్పర విశ్వాసంతో ఆ నూతన రాష్ట్ర పురోభివృద్ధిని సాధించాలని కూడా ఆయన హితవు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌కు ఉపమంత్రుల నియామకం కూడా జరగవచ్చుననీ, మాజీ ఆంధ్రప్రభుత్వ ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు కూడా నూతన మంత్రివర్గంలో చేర వచ్చుననీ అనుకొంటున్నారు.

ఈ రోజుననే ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్ బెంగు

షూరులో ఐక్యకర్ణాటక రాష్ట్రావతరణ ప్రారంభోత్సవం జరిపారు.

నూతన రాష్ట్రాలతో పాటు వెలసిన కేంద్రపాలిత ప్రాంతాలు యివి: ఢిల్లీ, హిమాచలప్రదేశ్, మణిపూర్, త్రిపుర, లక్షదీవులు, అమినీదీవులు, అండామాన్, నికోబార్ దీవులు,

నూతన రాష్ట్రాలన్నీ శాంతి సమృద్ధులతో అభ్యుదయ పథాన పురోగమించగలవనే ఆశిద్దాం.

### ప్రపంచ విజ్ఞాన సంస్థ సమావేశం

ప్రపంచ విజ్ఞాన సమితి (యూనెస్కో)నవమ సమావేశం నవంబర్ 5 వ తేదీని ఢిల్లీలో సమావేశమయింది. ఈ సమావేశానికి వివిధదేశాల ప్రతినిధులు హాజరైనారు. భారత ప్రభుత్వ విద్యామంత్రి శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈ సమావేశంలో ప్రసంగిస్తూ మానవకోటికి ధర్మ ప్రబోధం చెయ్యడమే సంస్థ ప్రధానాశయమని ఉగ్గడించారు. ఈ సమావేశానికి శ్రీ ఆజాదే అధ్యక్షత వహించారు. ప్రధాని నెహ్రూ కూడా ఈ సమావేశంలో ఉపన్యసించారు.

### ఏ. ఐ. సి. సి. సమావేశం

ఆలిండియా కాంగ్రెస్ కమిటి నవంబర్ 9 వ తేదీని కలకత్తా బెలియాఘాట్ మైదానంలో వేయబడిన ప్రత్యేక మండపంలో సమావేశమయింది.

దీనికి ముందు వర్కింగ్ కమిటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాని నెహ్రూ ప్రసంగిస్తూ ఈజిప్టులో యుద్ధవిరమణ జరిగినప్పటికీ అంతర్జాతీయ పరిస్థితి అత్యంత క్లిష్టంగానే వుండగలదని వక్కాణించారు. ఆ తర్వాత ఏ. ఐ. సి. సి. సమావేశంలో ప్రసంగిస్తూ పరిస్థితుల ప్రాబల్యంవల్ల తప్పనిసరి అయితే తప్ప కామన్వెల్తు నుంచి ఇండియా వైదొలగరాదని ఆయన సలహా యిచ్చారు.

ఈజిప్టు, హంగరీలలోని పరిస్థితిపట్ల ఆందోళనను వ్యక్తపరిచే తీర్మానాన్ని ఏ. ఐ. సి. సి. సమావేశం ఆమోదించింది.

హంగరీలో ప్రజాస్వామ్య పద్ధతులకు ప్రోత్సాహం లభిస్తున్న దనడానికి అక్కడి సంఘర్షణలే తార్కాణమని భారతప్రధాని అన్నారు.

ఇండియాలో కాపిటలిష్టులకు కమ్యూనిస్టు విధానాలకు మధ్యేమార్గమైన కొత్తపద్ధతిలో సోషలిజాన్ని రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నవని ఆయన సూచించారు.

బెలియాఘాట్ మైదానంలోనే నవంబర్ 11 వ తేదీని జరిగిన యువజన, విద్యార్థి సమావేశంలో ఉపన్యసిస్తూ ప్రజాస్వామ్య సోషలిస్టుభారత నిర్మాణానికి యువకుల కృషిక్రమశిక్షణతో శాంతియుతంగా జరగాలని ఉద్బోధించారు.

10 వ తేదీని జరిగిన ఏ. ఐ. సి. సి. ఉపసంఘ రహస్య సమావేశంలో ప్రసంగిస్తూ, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నగరంలోని నూరు కుటుంబాల యోగక్షేమాల పట్ల శ్రద్ధ వహించి సేవ చెయ్యడం కంటె ప్రజలకు కాంగ్రెస్‌కు మధ్య సన్నిహితత్వం పెంపొందే మార్గం మరొకటి లేదని సలహా యిచ్చారు.

మరొక బహిరంగ సభలో మాట్లాడుతూ దేశానికి పది సంవత్సరాలలో పారిశ్రామిక స్వయం పోషకత్వం సమకూడగలదని కూడా ప్రధాని పండిట్ నెహ్రూ ఉద్ఘాటించారు.

### కొలంబో రాజ్యాల సభ

కొలంబో ప్రణాళికలో పాల్గొంటున్న రాజ్యాలు ఇండియా, ఇండొనీసియా, సింహళం, బర్మాల ప్రధాన మంత్రులు నవంబర్ 11 వ తేదీని ఢిల్లీలో సమావేశమైనారు. కొలంబో రాజ్యాలలో మరొకటైన పాకిస్తాన్ ఈ సమావేశంలో పాల్గొన జాలనని తెలియ చేసింది.

పశ్చిమ ఆసియాలో ఏర్పడిన కల్లోలిత పరిస్థితులను గురించి చర్చించడానికే ఈ సమావేశాలు మూడు రోజులు జరిగాయి. సమావేశాలకు పిదప నాలుగు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటన చేస్తూ ఈజిప్టు నుంచి విదేశ సేనలు బేషరతుగా వెంటనే ఉపసంహరించ బడాలని, తమ యిచ్ఛ వచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకొనే స్వేచ్ఛాధికారాలు హంగరీ ప్రజలకు వుండాలనీ అన్నారు. ప్రపంచ శాంతి సాధనకు కొలంబోరాజ్యాలు కృతనిశ్చయమై వున్నవని కూడా వీరు అన్నారు.

లోగడ బాండుంగ్‌లో జరిగిన ఆఫ్రోషియన్ రాజ్యాల ద్వితీయ సమావేశం జరిపించటానికి కూడా వీరు నిర్ణయించినట్లు ప్రకటించ బడింది.

## కొత్త ఫ్యాక్టరీలు

20 కోట్ల రూపాయల పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్‌కు నత్రజని ఎరువుల ఫ్యాక్టరీ విజవాడలోనో, రామగుండంలోనో ఏర్పాటు కాగలదని విశాఖ పట్నంలో త్వరలోనే డిసిల్ ఇంజన్‌ల ఫ్యాక్టరీ ఏర్పాటు చెయ్యబడగలదని ఇండియా ప్రభుత్వ ఉత్పత్తి శాఖామంత్రి శ్రీ కె. సి. రెడ్డిగారు నవంబర్ 17 వ తేదీని హైదరాబాదులో ప్రకటించారు.

## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లి

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లి తొలి సమావేశం డిసెంబర్ 3 వ తేదీని ప్రారంభించి మూడు రోజులు మాత్రమే జరగగలదని, స్పీకర్ ఎన్నిక కూడా ఈ సమావేశంలో జరగగలదనీ హైదరాబాదు నుంచి వచ్చిన వర్తమానం తెలుపుతూ వుంది.

## విదేశాలలో విషమస్థితి

విదేశాలలో రెండే రెండు అతిముఖ్యమైన సంఘటనలు జరిగాయి. మొదటిది ఈజిప్టుపై ఇజ్రాయల్, బ్రిటన్, ఫ్రాన్సుల ముట్టడి.

ముందు అక్టోబర్ 30 వ తేదిని హఠాత్తుగా ఇజ్రాయలీ సైన్యాలు ఈజిప్టుకు చెందిన గాజా, సినైలపై దాడి జరిపాయి. ఈజిప్టు ప్రతిఘటించింది. ఆ యుద్ధాన్ని 12 గంటలలో విరమించక పోతే తాము జోక్యం పెట్టుకొంటామని బ్రిటన్, ఫ్రాన్సులు ఈజిప్టుకు, ఇజ్రాయల్‌కు అంత్య సందేశం పంపాయి. దానికి ఇజ్రాయల్ ఓహో అంది. ఈజిప్టు తిరస్కరించింది.

ఆంగ్లో-ఫ్రెంచి నౌకలు విమానాలు, పెరాఛూట్ సైన్యాలు ఈజిప్టులోని రేవులపైన, విమానాశ్రయాలపైన దండయాత్ర ప్రారంభించాయి. ఒక వంక ఇజ్రాయల్‌తో పోరుతూనే ఈజిప్టియన్ సైన్యాలు, ప్రజలూ ప్రచండమైన ఆంగ్లో ఫ్రెంచి దాడులను నిరోధించారు. అనేక నౌకలను ముంచివేశారు. విమానాలను కూల్చారు.

పోర్టుసయ్యాద్ రేవు పట్టణంలో మాత్రమే బ్రిటిష్, ఫ్రెంచి సైన్యాలు ప్రవేశించ గలిగాయి.

యావత్ప్రపంచం బ్రిటన్, ఫ్రాన్సుల దుశ్చర్యను నిరసించింది. వెంటనే ఈజిప్టునుంచి తప్పుకోక పోతే తాను సైనికంగా కలగ చేసుకొంటానని రష్యా హెచ్చరించింది. ఆతర్వాత అమెరికా ఒత్తిడివల్లనే అయివుండాలి, నవంబర్ ఎనిమిదవ తేదీని యుద్ధ విరమణకు ఉత్తర్వు చేశాయి.

మిత్రరాజ్య సమితి పశ్చిమ ఆసియాలో శాంతి రక్షణకు అంతర్జాతీయ పోలీస్‌దళం ఏర్పాటు చేసి, యిప్పుడు ఈజిప్టులో చేరుస్తోంది.

రెండవది హంగరీ పరిస్థితి. హంగరీలో రష్యాకు వ్యతిరేకంగా ప్రదర్శనలు ప్రారంభం కావడంతోనే చిచ్చు ముట్టింది. మాజీప్రధాని నాగీ తిరిగి అధికారానికి రావడం, తన ప్రాబల్యం పోతున్నదనే భయంతో జోక్యం పెట్టుకొని కమ్యూనిస్టు ప్రభుత్వం స్థాపించి, నాగీని అరెస్టు చేయించడం జరిగాయి, అక్కడ కూడా శాంతిస్థాపనకు మిత్ర రాజ్యసమితి యత్నిస్తూంది.

## ఐజెన్ హోవరు

అమెరికాకు తిరిగి మరొక టరమ్ ప్రెసిడెంట్‌గా ఐసెన్ హోవరే ఎన్నుకొన బడ్డాడు.

## మాజీబ్రిటీష్‌ప్రధాని లార్డ్ అట్లీ

సతీసమేతంగా ఇండియాలో పది రోజులు పాటు పర్యటించి వెళ్లారు.

# ఆంధ్ర మాత!

శ్రీమతి పండితారాధ్యుల సుశీలాదేవి

కృష్ణగోదావరీగీతికా రవములో
తుంగభద్రతరంగ మృదంగ సుస్వనములో
యాంధ్రకాంతలచేతిహారతివెలుగులో
అవతరించె విశాలాంధ్ర యగుచునేడు

సీ॥ ఆంధ్ర శిల్పులయంక! ముందున నిల్పక
 సాకిపెంచినమేటి సాధుమూర్తి
త్యాగరాయని దివ్య గానవాహినిలోన
 స్నానమాడినయట్టి ధన్యురాలు
గోపన్న మొదలైనగొప్ప భక్తులగాంచి
 పులకించి నిలచిన పుణ్యురాలు
అసువుల నర్పించి యాత్మశీలమునిల్పు
 పడతులగన్నట్టి, భవ్యశీల

శౌర్యగాంభీర్య దానంబు, శాంతినిచ్చి
యీర్ష్యకోపాలు మనలోన యింకజేసి
విశ్వసోదర ప్రేమతో వెలయుడనుచు
తెలియజేయుచు సాకుమా తెలుగుతల్లి!


సీ॥ శ్రీకృష్ణరాయల, శీలసత్కీర్తులు
 వేవెలుంగులదిశల్ వెలిగినట్లు
కాకతీయులనాటి ఘనవైభవోన్నతి
 వేయిస్తంభాకృతి వెలసినట్లు
చాళుక్యనృపతుల, జయభేరిమ్రోతల
 పరరాజుగుండెలు పగిలినట్లు
పలనాటి వీరుల ప్రాభవభుజశక్తి
 దేశదేశములందు తెలిపినట్లు

వీరబొబ్బిలిసింహాల విక్రమంబు
విమల మాంచాల రుద్రమ్మ వీరశక్తి
సన్నగిల్లక సేసలు జల్లుకొనుచు
యాంధ్రజ్యోతి వెలుంగుమీ యఖిలదిశల.

సీ॥ శబ్దశాసనుచేత సానదీరినమేటి
 పంచమవేదమై పరగుప్రతిభ
పసుపునలదినతాళపత్రమ్ములందున
 కవిబ్రహ్మ కనకంపు గంటరవము
రాజరాజులచేత, రతనాలపల్లకి
 నెత్తించు కవితాత నేర్పుగరిమ
కంచుఢక్కలమ్రోత గట్టించి విజయుడై
 కనకాభిషేకంబు గాంచుశివి
కాటుక కన్నీరు కరతలంబులనొత్తి
 భారతినోదార్చు బహుళశక్తి

వాణి నారాణియంచును, వాదప్రౌఢి
మాటనెగ్గించుకొనునట్టి మార్గణంబు
మరచిపోకుండ వారల, మార్గమందె
నడుపుకొనవమ్మ మమ్ముల, నాంధ్రవాణి

ముగ్ధమోహన సౌందర్యమూర్తివగుచు
పచ్చిపైరను బంగారు పైటవేసి.
మధురఫలపుష్పసంభార మధ్యయగుచు
అదుగోదీవించె మనలను, ఆంధ్రలక్ష్మి.




వరకట్నమ్ముగ వేలుం
గురిపించెడి వధువు గలుగఁ గోరఁడె వరుఁడున్ ?
తరుణులు, యువకులు శుల్కము
నిరసించెడి నీతి నెపుడు నేర్తురొ ! సుమతీ !

ఓలి తొలంగిన దనుకొని
ఆలిని-గ్రుడ్డిని వరించు నాతని యింటన్
ప్రేలవె పాత్రము లెల్లన్
వేళాకోళమున మగఁడు వెతఁ బడు సుమతీ !

ఓలిం గైకొనుటకుఁ దమ
బాలికలను ముసలి మగల పాల్చేసిన యా
కూళలఁ దలిదండ్రులఁ గని
హేళన గావించుచుందు రెల్లరు సుమతీ !

పరిణయమునఁ గట్నముఁ గొను
వరునకు, వధువునకు, వారి బంధుజనులకున్
జరిమానయుఁ, జెఱసాలయు
జరిగించెడి చట్ట ముండఁ జనుఁ గద ! సుమతీ !

మనలో మనమా టనుచున్
వనితకు నెఱిఁగింప గుట్టు బయటం బడునా ?
తన మనమునఁ గల మాటను
వినిపింపఁడు సతికి, అతఁడు వీఱిఁడి సుమతీ !


మందులు, మ్రాఁకులచేతం
గొందఱు వశపఱచు కొనఁగఁ గోరుట వృథయౌ
డెందము రంజిలు మాటల
నందించిన సర్వ వశ్య మౌఁగద ! సుమతీ !

మాటలె మంత్రమ్ములు, పని
పాటలె తంత్రములు, చెల్మె వనమూలికలౌ,
సూటిగ యోజింపనిచో
బూటకములు నమ్మి మోసపోయెదు సుమతీ !

మాటలు మూటల నిచ్చును
మాటలు సున్నమ్ము గూర్చు మది చెదిరినచో
మాటల పాటవముం గొనఁ
బాటు పడుము; దానఁ గీర్తిఁ బడయుము సుమతీ !

దైవము పూనినఁ బూజలు
గావింతురు; దయ్య మూనఁగా శిక్షింతురుగా !
దైవము, దయ్యము రెండును
దేవుండగు, శబ్ద మహిమఁ దెలియుము సుమతీ !

కొట్టిన, కొట్టక యుండిన
నట్టింట గూరుచుండి, నయనములందుం
బిట్టుగ నీటిం బెట్టెడి
నట్టిది తన పతికి మృత్యువగుఁ గద ! సుమతీ !



# పరివర్తన

అనిపెద్ది వెంకటరత్నం

ఆరోజు ఉదయం 7 గంటలకే "సరిత" తన తల్లి గారి యింటివద్ద అలవాటు ప్రకారం పూజా సామగ్రి సమకూర్చుకొని శ్రద్ధాభక్తులతో తులసీ పూజ చేస్తూంది. అక్కడ ఆమె జీవిత సాగరంలో ఎట్టి అలజడి లేక దైవానిదే భారం అన్నట్టు చుక్కాని లేని తన జీవిత నౌకను నడుపుతూవుంది.

పూజ పూర్తి అయి తులసికి మంగళహారతి ఇచ్చి అపరాధం క్షమించ మన్నట్లు చెంపలు వేసికొని దేవికి వంగి నమస్కరిస్తూ వుంది. అదేసమయంలో తులసీదేవిమీద పూజచేసిన పువ్వులు కొన్ని అప్రయత్నంగా దగ్గరనే వుంచిన హారతి పళ్ళెంలో జల జల మని రాలాయి. యింతలో బయట తలుపు తట్టినట్లు అనిపించిందామెకు. ప్రసాదం తీసుకొని వెళ్ళి తలుపు తెరచింది. పోస్టుజవాను ఒక కవ రామెచేతికిచ్చి చక్కాపోయాడు. తన బాధ్యత తీరిపోయినట్లు అందుకున్న కవరు ఆత్రంగా చించి ఈవిధంగా చదివింది.

ప్రియమైన సరితకు.

నా యీ హీనస్థితిలో నీవే శరణ్యమని యిప్పటికి గ్రహించగలిగాను. ఈ అభాగ్యునికి నీహృదయంలో స్థానంపుంచే నీరాకకు నిరీక్షిస్తున్న

"ఆనంద్"

ఉత్తరాన్ని ఆమె తన పవిత్రాశ్రువులతో తడిపింది. అంతవరకు ఏదరి కానరాని తన జీవిత నౌకకు వడ్డు సమీపించుచున్నదన్న సంతోషంతో ఆమె ఆనందాశ్రువులనే రాల్చిందనుకుంటాను.

పసితనంలోనే తన మాతృదేవతను పోగొట్టుకొన్న అభాగ్యజీవి సరిత. తల్లి లేని బిడ్డ అవడంవల్ల తండ్రి ఆమెను కళ్ళల్లో పెట్టుకొని పెంచి తగినట్లుగా విద్యాబుద్ధులు చెప్పించి యుక్తవయస్సు రాగానే మూడు ముళ్ళూ పడ్డాక అత్తవారింటికి పంపాడు రామయ్య. "సరిత" చిన్నతనంనుంచీ అభాగ్య జీవి అవడంవల్ల కాబోలు వివాహం అయి అత్తవారింటికి వెళ్ళిన కొద్ది కాలానికే భర్త ఆగ్రహానికీ, అజ్ఞానానికీ గురియై పుట్టింటికి నెట్టబడింది.

తండ్రి చేతికి ఆ వుత్తరాన్నిచ్చింది నీ అభిప్రాయమేమన్నట్టు. ఉత్తరంలో అంతరార్థాన్ని గ్రహించిన తండ్రి కుమార్తెను ఆ మర్నాడే అత్తవారింటికి వెళ్ళవలసినదిగా ఆదేశించాడు.

ఆరాత్రి 'సరిత' తండ్రికి భోజనంపెట్టి తనింత తిని మర్నాడు అత్తవారింటికి ప్రయాణానికి కావలసిన పరికరాలు సర్దుకొని ప్రొద్దుపోయి పడుకుంది. కాని నిద్రపట్టలేదు. ఆ రాత్రంతా ఆమె మనోసాగరంలో ఏవో వూహించి వ్రాయజాలని భావతరంగాలు లేచాయి. కాని అవి ఒడ్డుకు చేరకుండగానే మాయమౌతున్నాయి. ఆమె ఆ రాత్రంతా తన మనోసాగరభావతరంగాలలో మునిగి తేలుతూ కాలం గడిపింది.

"ఆనంద్" తండ్రికి ఒకే బిడ్డ కావడంవల్ల కొంచెం గారాబంగానే పెరిగాడని చెప్పవచ్చు. పెంచి పెద్దవాణ్ణి చేసి ఆనందించవచ్చుననుకున్న ఆ తండ్రి ఆలోచనలకు విరుద్ధంగా "ఆనంద్" ప్రవర్తన మారు త్రోవలు త్రొక్కుతున్నట్లు గ్రహించి ఈసమయంలో వివాహం చేస్తే బాగుపడగలడన్న వూహలతో వివాహం చేశాడు తండ్రి. (ఈసమయంలో మనపెద్దలు కొంతవరకు ఓర్పుతోను, తెలివితోను మెలగడం మంచిదనుకుంటా) కాని వివాహం అయి భార్య కాపురానికి వచ్చిన కొద్ది రోజులకే ఆనందు పూర్తిగా మారిపోయాడు. కని పెంచిన తలిదండ్రులను కాదని ఆస్తిని పంచుకొని దుష్ట సహవాసాలకూ, దురభ్యాసాలకూ దాసుడై ఒళ్ళు మరచి ప్రతిరోజూ భార్యను అనేక విధాలుగా హింసించడం ఆనందుకు ఒక పని అయింది.

తల్లిలేని బిడ్డ, ఎన్నడూ కన్న తండ్రిచేతనయినా ఒక్కమాట పడిఎరుగని "సరిత" ఈనాడు పరపురుషునిచేత పుస్తి కట్టించుకున్న పుణ్యానికి భర్త పెట్టే బాధలను

సహిస్తూ తన అభాగ్యానికి కృంగి కృశిస్తూ ప్రొద్దుపుచ్చు తూవుంది.

ఆరోజు రాత్రి ఆనంద్ పూర్తిగా త్రాగి మైమరచి యింటికివచ్చి భార్యను అకారణంగా కొట్టి తిట్టి పుట్టింటికి నెట్టాడు.

"ఆనంద్" క్రమక్రమంగా తన ధనాన్నంతటిని గ్రీష్మరుతువులోని చెరువునీటిమాదిరి కాజేశాడు. ఆనాటి అతని ఆత్మమిత్రులిప్పుడతని ఆత్మశత్రువులయ్యారు. వారు అతనిని ఎండిన చెఱువును కప్పలు వదిలినట్లు అతనిని వదిలిపోయారు. ఇప్పుడు "ఆనంద్" ఏకాకి అయ్యాడు. ఈ స్థితిలో అతనికి రోజు గడవడం కష్టతరం అయింది. తిన తిండికి కట్టబట్టకు దూరమయ్యాడు. శరీరం శుష్కించుతూంది! అటు కని పెంచిన తలిదండ్రులను, ఇటు అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యను కాదని కాలతన్నుకున్నాడు. ఈ హీన స్థితిలో జీవితంమీద రోతపుట్టి యిక ప్రపంచంలోవుండి మాత్రం ప్రయోజనం లేదని భావించి, ఈ పరిస్థితిలో అతనికి ఆత్మహత్య అన్నివిధముల మేలనుకున్నాడు కాబోలు. అందుకు వెనుదీయకుండా తన యింటిలోని దూలమునకు త్రాడుగట్టి పురితీసికొనడానికి త్రాడు మెడకు తగిలించబోతూ మెడ పైకి ఎత్తాడు. ఎదురుగా గోడకు తగిలించిఉన్న ఫొటో అతని దృష్టికి గోచరించింది. ఫొటోలోని నవ్వుతున్న యువతిని అతడు ఆశ్చర్యంగా చూడసాగాడు. ఆ ఫొటోలోని వ్యక్తి చిరునగవుతో "ఆగు త్వరపడకు. ఆత్మహత్య, అసమర్థులకు, పిరికి పందలకు అవసరమైనది. నీవు నీగతాన్నంతటినీ మరచిపో! ఈ పరిస్థితిలో ఓర్పు అవసరం. మానవ జీవితం సుఖ దుఃఖపూరితము. సుఖానికి సంతోషించడం. దుఃఖానికి విచారించడం మానవ సహజం. గతాన్ని మరచి భావి కర్తవ్యాన్ని గురించి యోచించు. కష్టాలను ఎదుర్కొనలేక చావడంకన్న బ్రతికీ సాధించినవాడే ఉత్తమ మానవుడు. ఇప్పటికైనా మించిపోయినదిలేదు." అని ఏవేవో మాటలు చెప్పినట్లు అతనికి అనిపించింది కాబోలు. వేసినముడి విప్పాడు. తరువాత తెలివి తెచ్చుకొని ఆ ఫొటోలోని యువతి అలనాడు అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్య "సరిత" అని గుర్తించగలిగాడు. అప్పుడు అతడు తన మనస్సులో, అరిగి చిల్లులుపడి శిథిలమై తిరిగి నూతనంగా నిర్మించబోయే తన సంసార నౌకలో స్వేచ్ఛగా విహరించుటకు "సరిత" అవసరం అని గ్రహించ గలిగాడు.

ఫొటోవైపు మరొకసారి చూచి కన్నీరు కార్చాడు. క్షమించమని అర్థించినట్లుగా వెంటనే ఆమెపేర ఒక లేఖ వ్రాసిపంపాడు. కానీ ప్రతిఫలం ఏమౌతుందోనన్న వూహలతో ఆనందుకు నిద్రపట్టలేదు. ఆలోచనలతో ఆఖరుజామున ఒళ్ళు తెలియకుండా నిద్రపట్టింది.

ఎవరెన్నిపనులను మానుకొన్నా తనపని తను మానని బాల భాస్కరుని లేతకిరణాలు ఒడలు తెలియకుండా నిద్రపోతున్న "ఆనంద్"ను కిటికీ ఊచలమధ్య నుండి నీ సోమరితనాన్ని చాలించు అన్నట్లు అతనికి జాగృతిని కలిగించాయి.

ఆరోజున ఆనందులో ఏదో ఆనందం ఉదయించినట్లయింది. కాలకృత్యాలు తీర్చుకొని అప్పటికి కొన్ని సంవత్సరాలుగా పాడై దుమ్ముపట్టిన వస్తువులను బాగు చేస్తూ వాటిని యథాస్థానంలో సర్దుతున్నాడు బాధ్యత గల సంసారిలాగ. పగలంతా కఠినపరిశ్రమచేత అలసట చెందిన సూర్యభగవానుడు తన విశ్రాంతిగృహం చేరపోతున్నాడు. ఆసమయంలో ఆనంద్ తన దొడ్డిలోని మాలతీతీగక్రింద కుర్చీలో కూర్చుని ఏదో కథ చదువుతున్నాడు మైమరచి. అది తన జీవితానికి సరిపోతుందేమో! కథలో ఒక యువతి దురాచారియగు తన భర్తచేత త్యజించబడి తిరిగి అతని కోరికపై కొంతకాలానికి అత్తవారింటిలో అడుగు పెట్టింది. యింతవరకు కథను మైమరచి చదువుచున్న ఆనందుకు వీధిలోబుప్పు తట్టుతున్నట్లు వినిపించింది. పుస్తకంపేజీలు ప్రశ్నసంమున పెట్టుకొని వెళ్ళి తలుపు తెరచాడు ఎవరా? అని. గుమ్మంలో నిలబడిన ఆమెను చూచి తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు. సరిత తన భర్త మలినవస్త్రములను శుష్కదేహమును చూచి నోట మాటరాక దుఃఖాశ్రువులు రాల్చింది. ఆనందమై కళ్లవెంటరాలు కన్నీటి ముత్యాలను తన చేతులతో ఏరుచూ ఆమెచేతులు పట్టుకొని ఆమెనిలా అర్థించాడు. "అలనాడు రాత్రి ఏపాపపు చేతులు నిన్ను కొట్టి హింసించాయో ఈనాటిరాత్రి ఆచేతులే నిన్ను "క్షమార్పణ" వేడుకుంటున్నాయి సరితా!"

తెల్లవారింది. సరిత తన తండ్రికి లేఖ వ్రాసింది. పూజ్యశ్రీ నాన్నగారికి.

నేనిప్పుడు "ఆనందం" తో వున్నాను

మీ కుమార్తె "సరిత"

# తిరుమలేశ?

చదలవాడ కోటినరసింహము

సాహితియును లేదు సౌందర్యమును లేదు
మాట—మంతి లేదు, మమత లేదు
నిక్కి వెక్కిరించుఁ జక్కని వారిని
దీని భావమేమి? తిరుమలేశ !

వలువ లొలువ నెన్నొ వెలువడుచుండును
ద్రుపద దుహిత యంత దోష మంట
బ్రహ్మచారి దాని వంటఁ గైకొనఁ దంట
దీని భావమేమి? తిరుమలేశ !

చూపులేని కన్ను, సుందరమౌ కన్ను
తోలులేని కన్ను, తోఁక కన్ను
కన్ను గాని కన్ను, కాల కంఠుని కన్ను
దీని భావ మేమి? తిరుమలేశ !

పక్షి యందువేమొ, పాదముల్ నాల్గుండు
మృగముగాఁ దలంతువేమొ, యెగురు
గ్రుడ్డి యందువేమొ, క్రుమ్మరు నడిరేయి
దీని భావ మేమి? తిరుమ లేశ !

చాకి తాఁక నట్టి సరసీ స్థలమ్మున
సూర్యుడైన గననిఁ శుద్ధ జలము
స్నానమునకు నీ కొసంగు సద్భక్తుండు
దీని భావ మేమి? తిరుమలేశ !

అందరాని యట్టి యంబరంబున యందు
వడియములను బెట్టువార లెవరొ
లెక్కలేని వాని యక్కఱ యెట్టిదో !
దీని భావ మేమి? తిరుమలేశ !

తెల్లమడిని గొన్ని నల్లని విత్తులు
చేతితోడ దున్ని చేర్చిరేని
ఫలిత మొకరి కొకరు పంచుకొనం దగు
దీని భావ మేమి తిరుమ లేశ !

చిటుకు—పటుకులాఁడి శిష్టునిం బ్రేమించి
తృప్తిపఱచి, విశ్రమించ కుండ
ఇంటి బయట కెగిరి, యేగి, అంటగు నంట
దీని భావ మేమి? తిరుమ లేశ !

నాల్క తెఱచి యొక్క నక్క పండిన దని
ముసలివచ్చి, గడ్డి మూట వేయ
కొఱకి వెలికి నెట్టె, గుటక వేయక యది
దీని భావ మేమి? తిరుమలేశ !

పండుకాయ రంగు పసుపు పచ్చగ నుండు
విత్తనమ్ము, రసము వెలిగ నుండు
ఒకఁడు తిన మఱొక్కఁ డువ్విళ్ళ గొనుచుండు
దీని భావ మేమి? తిరుమలేశ !

---

## జవాబులు

1. కోఁతి 2. ఉల్లిగడ్డ. 3. నెమలియీఁక కన్ను 4. గబ్బిలము 5. కొబ్బెరకాయ నీరు
6. చుక్కలు 7. అక్షరములు 8. విస్తర 9. కత్తిపీఁట 10. నిమ్మపండు.

పలునాటి వీరనారి :

# నాయకురాలు

శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి

కర్ణుడు లేనిది భారతము లేదు. ఆ విధంగానే నాయకురాలు లేనిది పలునాటి చరిత్రలేదు. నాయకురాలు పలునాటి చరిత్రలో ముఖ్యపాత్రధారిణి. సౌశీల్యవతి. రాజ్యతంత్రవిదుషీమణి. వీరశైవురాలు. ఆమె పుట్టుకను గురించి చిన్న కథ గలదు. నలగామ రాజు పల్నాటిని అరణముగా పొంది గురజాలను రాజధానిగా చేసికొని పలునాడు పాలించుచుండెను. బాలమలదేవులు పసివారై నందున పరిపాలనలో జోక్యము కలుగ జేసికొన లేదు. బ్రహ్మనాయుడు మంత్రి పదవి నధిరోహించి చాక చక్యముగా పరిపాలనా రథమును నడిపించుచుండెను.

గురజాలకు ఎనిమిది మైళ్ళదూరమున దాచేపల్లి అను గ్రామమున్నది. దాని నానుకొని రెండు మైళ్ళదూరమున జట్టగామాలపాడను గ్రామము గలదు. అందు రామిరెడ్డి అను రైతు గలడు. అతడొకనాడు పొలము దున్నుటకు ఉదయముననే పోగా పొలము ప్రక్కనున్న పొద నుండి ఒక పసిపాప రోదనము వినవచ్చెను. అతడు వెళ్ళిచూడగా ఒక పసిపాప కనుపించెను. ఆ శిశువును తీసికొనివచ్చి బిడ్డలు లేని తమకు భగవంతుడే ఈ బాలికను ప్రసాదించె నని కడు అల్లారు ముద్దుగా బెంచి పెద్దచేసి వివాహము చేసెను. కాని ఆమె పుష్పవతి కాక పూర్వమే విధవఆయెను. ఆనాటి నుండి ఆమె మొగరాయని వలె ప్రతికార్యము నందున ప్రముఖ పాత్రను వహించుచు తోటి మానవుల ఎడల ప్రేమ వాత్సల్యముతో నుండెడిది, అపుడామెకు నాయకు రాలను సార్థక నామమేర్పడెను.

ఒకనాడు నలగామ రాజు జట్టగామాలపాడు మీదుగా అడివికి వేటకు వెళ్ళిరి. ఈ సంగతి తెలిసిన నాయకురాలు అలిసి వచ్చిన నలగామరాజుకు చల్లని చలవ పందిరి, మంచి పానీయములను నేర్పరచి విశ్రాంతి తీసి కొనుటకు అనువుగ నేర్పరచెను. నలగాముడు మెచ్చి ఆమెకు వరమిచ్చెను. ఆ వరసహాయము వలన స్నేహ మేర్పరచుకొని తన ప్రజ్ఞావిశేషముల వలన మంత్రి పదవి నధిరోహించెను,

ఆమె శైవమతస్తురాలు. జట్టగామాలపాటి యందున శివాలయము నిర్మించెను. ఆమె ఆ శివుని పూజించు పుష్పములకై పూలతోటను పెంచెను. ఆ ఆలయ శిథిలము లీనాటికి గోచరములు. ఆ పూలతోట యిపుడు మాగాణిగా మారినను పూలతోట యనియె పిలువ బడుచున్నది. ఆమె ప్రతిదినము నైవేద్యదీపారాధనలతో శివుని పూజించెడిది. ఆమె వీరశైవురాలు.

రాజకీయములందు కడునేర్పరి. సాహసి. తనకు తన అధికారమునకు అడ్డుతగులునను ఉద్దేశముతో బ్రహ్మనాయకునిపై కత్తిగట్టెను. కోడి పందెముల నేర్పరచి యుక్తిచే నోడించి బ్రహ్మనాయుని రాజ్యభ్రష్టుని గావించెను. తదనంతరము యుద్ధము ప్రకటించెను. అల రాజు రాయభార మంపగా చివరకు నరశింగుని లోబరచు కొని అలరాజును చంపించెను. రాజకీయ చాతుర్యము నుపయోగించి యుద్ధరంగములో విజయము తనది గానే చేసికొన దలచెను. కాని యుద్ధము కారెమపూడిలో ప్రజ్వరిల్లుచుండ కన్నమదాసు మొదలగు వీరులు చెల రేగిరి. అపుడామెలో నున్న వీరత్వ ముప్పొంగెను. ఆమెయు కరవాలము ధరించి సైన్యముల నడిపించెను. సామర్థ్యముతో సైన్యముల నడిపించి బ్రహ్మనాయుని సేనలను చెల్ల చెదరుచేసెను, చివరకు బ్రహ్మనాయుని సంహరింప ఆవేశ పూరితయై ఖడ్గమెత్తెను. కాని ఆమెలోని మానవత్వం మేల్కొన్నది. ఆమె భావనలు తల క్రిందులైనవి. బ్రహ్మనాయుని చూచి ఆమె భక్తురాలుగా మారెను. వెంటనే ఖడ్గమును క్రిందవైచెను, ఇరువురును మాచర్ల చెన్నకేశ్వరునిలో నైక్యమయిరి.

నాయకురాలు సాహసస్త్రీ. ఆమెలో వీరత్వము. దయ, సోదర మానవుల సౌభాగ్యాలోచన పుట్టుకతోనే వచ్చినవి. ఆమె వీరశైవురాలే కాక వైష్ణవులన్న ఈర్ష్య. ఈ ఈర్ష్యే బ్రహ్మనాయునిపై ద్వేషాసూయలను వృద్ధి పరచెను, ఆమె స్త్రీలోకము నేర్చుకొన దగు పట్టుదల, వీరత్వము, భక్తి ప్రపత్తులను కలిగి యున్నది. స్త్రీయన్న అబల కాదనియు. పురుషునికి ఏ అంశములోను తక్కువ కాదనియు తన వచనములను ఆ చరణలో పెట్టి చూపిన ఆదర్శనారి. అన్నిటికన్న మించినది ఆమె సౌశీల్యము, ఈ నాటికి పలునాట ఆమెను ఎంతో గౌరవముతో తలంచు కొనుచుందురు.

# చిన్నికథ

సోమంచి నరసింహశాస్త్రి, బి.యస్.సి., బి.ఇడి.,

(ఆధునిక యుగము సినిమాయుగము. సినిమాను చూడనివారిని మానవులుగ పరిగణించుటలేదు యీ యుగము. సినిమా తారలను ఆదర్శముగ తీసికొని ప్రవర్తించుట యీ యుగ ధర్మమయినది. అద్దాని ప్రయోజన మెంతవరకు అనేప్రశ్న లేనేలేదు.

కలలో మనము పరోక్షముగా నుండి అనుభవించు అనుభవము వంటిదే. యీ సినిమా అనుభవమని గమనించు వారు అరుదు. అయ్యది "వినోదప్రదర్శనము" అని గ్రహించువారు కొలదిమంది మాత్రమే. అట్టి వినోదమునుండి విద్యను గ్రహించువారు స్వల్పము.

సినిమాతారల ఛాయా చిత్రములను సేకరించుట ఒకఆచారము అయింది యీ నాగరికతా ప్రపంచమందు. సినిమాతారలను కలసికొనవలయునన్న ఆసక్తి ప్రబలమయింది. తారలతో మాట్లాడుటే విద్య యని అనుకొనుట సామాన్య మయింది.

ఇట్టి వాతావరణముతో కూడియున్న ప్రపంచమందు జరుగుచున్న "ఒక భ్రమ ప్రమాదము"ను వ్యక్తము చేయునది యీ నా చిన్నికథ. ఇది కేవలము ఊహామాత్రము. వాస్తవమందు ఎవ్వరికిని సంబంధించి నదికాదు.

కావున యేరికైనను మనసున కష్టము కల్గించిన క్షమింపవలయునని పాఠక మహాశయులకు విజ్ఞప్తి.

(—రచయిత)

---

ఆమెకు పందొమ్మిది వత్సరములు. సినిమాలు అంటే సరదా, క్రొత్తగా బొంబాయి వచ్చింది. నాజూగ్గా వుంటుంది. నవీన పద్ధతులలో పెరిగింది. 'ఖార్' లో వుంటోంది పినతండ్రిగారి యింట్లో. ఒకనాటి సాయంకాలము "చర్చిగేటు" వెళ్ళుటకు స్టేషనుకువచ్చి అతనినిచూసింది. అతనికి సుమారు యిరువది అయిదు వత్సరము లుండునేమో. చూచి చూచుటతోడనే ఆమె అనుకొంది 'తప్పక నటుడు అయివుంటాడని' అతని చేతులో నున్న చేతికర్రను, అతని దుస్తులను ఆమె భావమును స్థిరము చేసినవి. అతనివైపు తీక్షణముగా చూచింది ఆమె. అతడును ఆమెవైపు చూచాడు. అట్లా చాలసేపు చూచుకొన్నారు ఒకర్ని ఒకరు. కాని పలుకరించుకోలేదు, ఆమె అతడు ఎక్కిన కంపార్టుమెంటులోనే ఎక్కింది. 'దాదరు' లో దిగిపోయేడు. ఆమె ముందుకు సాగింది, మనస్సును అతనికి వదలి ఆమె ఆలోచిస్తోంది. "తప్పక నటుడు అయివుంటాడు. లేకపోతే ఆవిధంగా వుండడు, మామూలుగా వుండే మనుష్యులకు, నటకులకు తేడా తప్పక వుంటుంది. యితడు తప్పక నటవర్గములో చేరి వుండి వుంటాడని. చేరి వుండట మేమిటి. తప్పక నటకుడే..." అనే అభిప్రాయాలు ఆమెను చుట్టుముట్టినయి. ఈ అభిప్రాయాలే ఆమెను కలవర పెట్టినాయి; ఆనాడు రాత్రి నిద్రపట్టకుండ జేసేయి.

మరునాడు అదే టైముకు బయలుదేరింది ఆమె స్టేషనుకు. ఆతడుకూడా వచ్చినాడు. క్రితం రోజున జరిగిన పనే ఆరోజున జరిగింది. ఇట్లు వారంరోజులు గడిచాయి. ఇంక కొంతముందుకు వెళ్ళాలనుకొంది ఆమె. ఎనిమిదవ రోజున ప్లాటుఫారం మీద యిద్దరు వున్నారు. రైలు యింకను రాలేదు. ఆమే తానున్న స్థలము నుండి ఆతనివైపు చూచి నవ్వింది. ఆతనికి ఆశ్చర్య మేసింది. ఎవరినో తెలిసిన వారిగ భావించిందేమో అని అనుకొన్నాడు. కాని ఆమె అదేపనిగ తనవైపుచూచి, చిరునవ్వులను ప్రారంభించుట అతనికి నచ్చలేదు. తనలో ఏదో లోపమున్నదేమోనని దేహము కలయచూచు కొన్నాడు. కాని లోపముంటేగా కనిపించడానికి. ఇకఉండబట్టలేకపోయేడు వెంటనే ఆమెను సమీపించాడు, తానే ఉపక్రమించాడు— సంభాషణకి "మనము యిదివరలో కలసికొన్నట్లుందే?"

అని ప్రశ్నించాడు "కలసికొని వుండవచ్చు. అనేకమందిని కలిసి కొంటూంటాము రోజూ" అని సమాధానమిచ్చింది. ఆమె కొంచెతనంగా. ఆమె మాటలు ఆతనికి అర్థము కాలేదు. కాని నెమ్మదిగ "అవునవును" అని అన్నాడు. అని అతడు తదేక దీక్షతో చూడసాగాడు ఆమెను.

అతడు అట్లు తన్ను చూస్తూంటే ఆమెకు వళ్ళు జల దరించింది. అతడు తన్ను ఒక 'నటి'గా భ్రమ పడుచున్నాడేమో!...ఎందుకు భావించరాదు.

తాను అందముగా నున్నది. చక్కగా దిద్దుకొన్నది. విలువైన దుస్తులను ధరించింది. ఈ విధమైన ఆలోచనలు పరిగెత్తాయి ఆమెలో. ఆలోచనలతో ముఖము ఎర్రబడింది. చెమట బిందువులు నుదుటిపైనుండి చెంపలపై పడసాగాయి. ఆస్థితి ఆమెకు వింతశోభను సమకూర్చింది. అతడు ఆమెను చూస్తూ అట్లా వుండి పోయాడు. శీతాకాలములో ఉదయమున వికసించిన ఎర్రగులాబీ జ్ఞాపకమొచ్చింది అతనికి. ఆమాట అందామనుకున్నాడు. కాని అంతలోనే ఆమెమనస్సును కుదుటబరచుకొని ధైర్యంతో అతనితో "ప్రస్తుతము పనిలోవున్నారా?" అని ప్రశ్నించింది. ఎలెక్ట్రిక్ ట్రెయిన్ వస్తోంది. ప్లాటుఫారము రైలు వేగమునకు దడదడ లాడింది. ఆమెను జాగ్రత్త అని హెచ్చరించేటట్టు ఆమె చేతిని అతడు గట్టిగా పట్టుకొని వెనుకకు లాగాడు. నెమ్మదిగ రైలు ఆగింది, ప్యాసింజర్లు దిగుచున్నారు.

"అవును దాదరులో పనిచేస్తున్నాను" అని చెప్పి జన సమూహములోనుండి ఆమెను రైలు సమీపమునకు తీసికొని వచ్చాడు. అపరిచితునికరస్పర్శ ప్రప్రథమంగా అనుభవించింది ఆమె. ఆమె గుండెలు కొట్టుకొంటూన్నాయి. ఏమి మాట్లాడాలో తెలియలేదు. "ఆ, అల్లాగా" అని మాత్రం అనగల్గింది. రైలులో మెక్కారు యిద్దరు. రైలు కదలింది. క్షణక్షణము రైలు వేగ మెక్కువవుతోంది. ఆమెకు ఆ సంగతే తెలియుటలేదు. ఎక్కడ వున్నదో, ఎవ్వరితో వున్నదో, తెలియుటలేదు. అంతా అగమ్యగోచరంగా వున్నది. ఏదో వూహా ప్రపంచంలో వుండిపోయింది ఆమె. ఆమె ఆలోచనల కంతరాయం కల్గించింది దాదరునుండిపోయే డక్కన్‌క్వీన్ యొక్క విజిల్.

"మీకు సినిమా చూడాలని వున్నదా?" అని ప్రశ్నించాడు అతడు. ఆమె అతనివైపు తీక్షణంగా చూచింది.

"చూడాలని వున్నది. సినిమా చూడడం నాకుసరదా" అని ఆమె అన్నది.

"అయితే యీవేళ చూతామా" అన్నాడాతడు,

"తప్పకుండా" అని అన్నదామె.

"అయితే రాత్రి 8 గంటలకు దాదరులో నున్న ప్లాజా థియేటరువద్ద నన్ను కలియండి" అని అన్నాడాతడు.

"మీరు అచ్చట వుంటారా?" అని ప్రశ్నించిందామె.

"నేను తొంభై తొమ్మిదిపాళ్ళు వైటింగ్ రూమ్‌లో వుంటాను మీకొరకు. ఒకవేళ నేను కనుపించక పోతే 'కుమార్' కొరకు వచ్చానని అచ్చటి బంట్రోతుతో చెప్పిన నాకు కబురందును నేను వెంటనే వస్తాను" అని అన్నాడతడు.

ఆమె "కుమార్! —రాత్రి 8 గంటలు"— అని నెమ్మదిగా ఒకసారి అనుకున్నది.

"నేను తప్పక వస్తాను" అని అన్నదామె.

ఇక సంభాషణజరుగలేదు మౌనంగా వున్నారుయిద్దరు దాదర్ స్టేషన్ వచ్చింది. అతడు వెళ్ళిపోతూ ప్లాజా థియేటరు వద్ద రాత్రి ఎనిమిది గంటలకు నీకోసం ఎదురు చూస్తు ఉంటాను" అని చిరునవ్వుతో అన్నాడామెతో.

"సర్టన్లీ విదవుట్ ఫెయిల్" అని అన్నదామె.

"రాత్రి థియేటరు" వద్దకు 8 గంటలకు సరిగావచ్చిందామె. జాగ్రత్తగా అలంకరించు కొంది. తాను అతనికి అందంగా కనిపించాలని ఆమె వూహ. ఏమో, అతనితోడి స్నేహము ఎట్లాపరిణమిస్తుందో థియేటరు ఎదుట తన దేహము నంతను కలియచూసుకొంది. చాలా అందంగా వున్నాననుకొంది. సగర్వంగా చిరునవ్వు నవ్వుకొంది. థియేటరులోనికి వెళ్ళింది ఆమె. "నేను యిప్పుడు సాధారణ యువతిని కాదు. నటకుడైన కుమార్ కొరకు వచ్చిన దానిని. అతడు నా అందచందములకు ముగ్ధుడై సన్నాహ్వానించాడు, యిచ్చటికి అని విజయసూచకముగా నవ్వుకొని, గర్వముతో అక్కడ నున్న మనుష్యులను చూస్తోంది. క్రమముగా వైటింగ్‌రూమ్ వద్దకు నడిచింది అచ్చట "కుమార్" లేడు. చుట్టూ అతని కొరకుచూసింది, దగ్గరగానున్న రిజర్వుడ్ క్లాస్ బుకింగ్ క్లార్క్ "ఎన్ని టికెట్లు" అని ప్రశ్నించాడు, "నేను టిక్కట్టు కొనడం లేదు" అని అందామె.

"అయితే ఎందుకలా నిలబడ్డారు" అని అన్నాడు బుకింగ్‌క్లార్కు విసుగుతో.

"నేను కుమార్ కొరకు వచ్చాను. ఆయన కొరకు చూస్తున్నాను" అని ఆమె అన్నది.

కుమార్ మాట విన్నతోడనే బుకింగ్‌క్లార్కు ధోరణి మారింది. వెంటనే తానుకూర్చున్న స్థలమునుండి బయటికివచ్చి ఆమెను అక్కడ వున్న ఒక కుర్చీలో కూర్చోమని చెప్పాడు. తాను కుమార్ కొరకు కబురంపగలనని చెప్పాడు. వెంటనే ప్రక్కనివున్న ఒక సేవకుని పిలిచి నెమ్మదిగా ఏదోచెప్పి తనపని చూచుకోడానికి వెళ్ళాడు. ఆ సేవకుడు వెంటనే అచ్చటినుండి వెళ్ళి పోయేడు.

కుర్చీలో కూర్చొన్న ఆమె అప్పుడు కొంచెము కంగారు పడింది. 'కుమార్ వున్నాడో, లేదో, ఏమి సమాధాన మివ్వాలో, తాను జ్ఞాపకము వస్తానోలేదో" అనే ఆలోచనలు బుర్రలో పరుగెత్తాయి. కొద్దిగా చెమటపట్టింది. హేండ్‌బేగ్‌లో వున్న అద్దముతీసి జాగ్రత్తగా ముఖము కర్చీఫ్‌తో తుడుచుకొంది.

ఈలోపుగానే సేవకుడు వచ్చి "కుమార్‌గారు యిపుడే వస్తామన్నారు మిమ్ములను కూర్చో మన్నారు" అని చెప్పాడు. కొద్దినిముషములలో 'కుమార్' వచ్చాడు. ఆ దీపపు కాంతులలో ఒకరిని ఒకరు చూచుకొన్నారు. చిరునవ్వు నవ్వుకున్నారు. దగ్గరగవచ్చి అతడు కరము సాచి ఆమెను ఆహ్వానమిచ్చాడు. ఆమె సగర్వంగా అతన్ని చూచింది. తాను రోజుచూచే వానికంటె చాలా అందంగా కనిపిస్తూన్నాడు. తాను గొప్ప అదృష్టవంతురాలుగ భావించుకొంది. అతనివంటి వారి స్నేహము దొరికినందులకు.

అతడు ఆమెను బాల్కనీ పైకితీసికొని వెళ్ళి థియేటరులో కూర్చుండజేసాడు. తానుపక్కన ఆసీనుడయ్యాడు అచ్చటి గేట్‌కీపర్‌తో రెండు కూల్‌డ్రింక్సు, బిస్కట్లు, పట్టుకొని రమ్మని చెప్పాడు. వెంటనే ఆ సేవకుడుపోయి ఆపదార్థములు తీసికొని వచ్చాడు.

బిస్కట్లు ఆమెను తినమని యిచ్చాడు. తాను తింటూ ఇంతలో యేదో జ్ఞాపకము తెచ్చుకొని సేవకుని పిలిచి, విశ్రాంతి సమయంలో అక్కడవుంటు చూస్తానని మేనేజరుతో చెప్పమన్నాడు సేవకుడు వెళ్ళిపోయేడు.

ఈ సంభాషణ వింటూన్న ఆమె "మీరు నటకులు కారా?" అనే ప్రశ్న నోటిచివరదాక తెచ్చుకొని, ప్రశ్నించలేక ఆగిపోయింది, తన తప్పిదానికి సిగ్గుపడుతూ. —

# సంక్షేమం



ఢిల్లీలో కేంద్ర సంక్షేమసంస్థచే నడుపబడుతున్న అగ్గిపెట్టెల కర్మాగారంలో స్త్రీలు పని చేయుటను మధ్యప్రదేశ్ గవర్నరు డా॥ పట్టాభి సీతారామయ్య వీక్షించుచున్నారు.

# యుగోస్లావియాలో సంఘసంక్షేమ కృషి

★ యుగోస్లావియాలో పిల్లల పెంపుకు, విద్యా బుద్ధులుగరప దానికి కార్మికులకు, ఇతర ఉద్యోగులకు, పిల్లల అలవెన్సు రూపంలో సహాయం చెయ్యబడుతుంది.

★ దీనికితోడు పిల్లలు పుట్టే సమయంలో కుటుంబానికి ప్రత్యేక మైన గ్రాంటు యివ్వబడుతుంది.

★ కార్మికుల, ఇతర ఉద్యోగుల కుటుంబాలన్నిటికి ప్రతిబిడ్డకు 15 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు, ఆవపకు విద్యాభ్యాసం కొనసాగిస్తూ 25వ ఏడు వచ్చేవరకు అలవెన్సు యిస్తారు.

★ శాశ్వతంగా ఏ అంగవైకల్యంవల్లనో దుర్బలులై వుండే పిల్లలకు 15 ఏళ్లు 25 ఏళ్లు వయస్సు దాటినతర్వాతకూడా అలవెన్సు యిస్తారు.

★ వరసగా కనీసం 12 నెలలు పనిచేసే వారు, లేదా మధ్య విరామాలతో కనీసం 20 నెలలువరకును పనిచేసేవారు ప్రత్యేక అలవెన్సుకు అర్హులౌతారు.

★ పిల్లల సంఖ్యపైనే అలవెన్సు పరిమితి ఆధారపడి వుంటుంది. ఒక్కొక్క బిడ్డకు కుటుంబానికి నెలకు 3,240 డాలర్లు, ఇద్దరికి 5,480 డాలర్లు, ముగ్గురికి 8,220 డాలర్లు వంతున ఈ అలవెన్సు యివ్వబడుతూవుంటుంది.

★ కార్మికుడుగాని, ఉద్యోగిగాని తనకుతానై అదనంగా ఆర్జించుకొన్న సందర్భాలలో నూటికింత అనే లెఖ్ఖను ఈ పిల్లల అలవెన్సు తగ్గించబడుతూవుంటుంది.

★ వేర్వేరు సంఘ సంక్షేమ కార్యక్రమాలకు తోడు అనేక తరహాల శిశు సంక్షేమ కార్యక్రమాలు, యుద్ధంలో అంగవికలులై దుర్బలులై పోయి కొన్నిరకాల పనిపాటులకు ఉపకరించే వారి పోషణకు, కొన్ని ప్రత్యేకలోపాలతో బాధపడుతున్నవారికి సాయంచేసే కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి.

★ సంఘ సంక్షేమకృషి ఎక్కువగా జరుగుతున్నప్పటికి ఆవిధానం ఇంకా సమగ్రస్వరూపం పొందలేదు. యుగోస్లావియాలోని యావన్మంది ప్రజలకు క్రమశక్తి అనువర్తింపజేయబడగల సాంఘిక భద్రత, ఆరోగ్య భీమావంటి రక్షణసౌకర్యాలను సమకూర్చదగు ప్రాజెక్టులు రూపొందించబడుతున్నాయి.

—



# శిశుసంరక్షణలో తల్లిదండ్రుల బాధ్యత

ఇంట్లో బిడ్డ పుట్టిందంటే దానిజీవితం తలిదండ్రులపైన కుటుంబంపైన మాత్రమే ఎక్కువగా ఆధారపడి వుంటుందనేది నిర్వివాదమైన అంశం. ఆ కుటుంబం పూర్ణజీవితాన్ని అనుభవించ గలగడానికి మనం ఏం చేసినప్పటికి దాని ప్రభావం ఆ కుటుంబం, ఆ కుటుంబంలోని బిడ్డల ఆరోగ్య సౌఖ్యాలపైన మాత్రమేగాక మొత్తంమీద జాతిపైనే ప్రసరిస్తుంది.

## కుటుంబ సమైక్యత :

భారతీయకుటుంబాలలో బాంధవ్యానికిఅమితప్రాబల్యం కానవస్తుంది. ప్రతిక్షణం పరివర్తనం పొందుతున్న ప్రస్తుత పరిస్థితులలో పూర్వపు అవిభక్త కుటుంబపు పద్ధతిని కొనసాగించడం సర్వత్ర సంభవం కాక పోయినప్పటికీ కుటుంబ సమైక్యతను నిలబెట్టడానికి అన్ని ప్రయత్నాలు చేస్తూ వుండడం అవసరం. పూర్వం అవిభక్త కుటుంబాల్లో ఎవరివల్ల లోటుపాట్లు కలిగినా సర్దుకుపోతూ తమతమ సమస్యలను కుటుంబంలోని వారు సర్దుకుంటూ కాలం గడుపుకొనేవారు.

సాంఘిక భద్రతకు అనేక ప్రణాళికలు, సంస్థలువున్న పాశ్చాత్య దేశాలలోకూడా వేర్వేరుసమస్యలను-ముఖ్యంగా మానసిక సమస్యలను పరిష్కరించడానికి కుటుంబ సంబంధాలను బలపరచు కొనడం అవసరమనే సంగతి గుర్తించ బడింది.

## తల్లులకు తరిఫీదు :

తమ బిడ్డల కోసం స్వీయసౌఖ్యాన్ని త్యాగం చెయ్యడానికి, వారియెడల ప్రేమానురాగాలతో వర్తించడానికి తలిదండ్రుల సంసిద్ధతను మెచ్చుకోవలసివున్నా శిశుసంరక్షణను విశిష్టంగా కొనసాగించదగు పద్ధతులలో పరిజ్ఞానాన్ని వారు ఇంకా ఎంతో అలవరచుకో వలసివున్నదనీ చెప్పకతప్పదు. బిడ్డల శారీరకారోగ్యానికి, మానసికవికాసానికి, మంచి అలవాట్లు, బుద్ధులు అలవడడానికి వారు తగిన కృషి చెయ్యలేక పోతున్నారు.

బిడ్డల పెంపునుగురించి స్కూళ్ళల్లోగాని, కాలేజీలలోగాని మనం నేర్చే చదువులు ఏమీవుండవు. బాగా చదువుకొన్న తలిదండ్రులు కూడా కష్టసాధ్యమైన శిశుసంరక్షణకు సంబంధించిన కొంతశిక్షణను పొందడం అవసరమని భావిస్తారు. ఈ పరిస్థితులే మనకు తెలియకుండానే శిశుసంరక్షణ పట్ల అలక్ష్యం జరగడం, వారు అనారోగ్యవంతులు కావడం, లేదా బాలనేరస్తులు కావడం వంటివి జరుగడానికి కారణమౌతున్నాయి. తమ బిడ్డల సంరక్షణ

శ్రీ విధన్ జె. లామ్

విషయంలో ఎక్కువ జాగ్రత తీసుకొనడానికి బిడ్డలను పూర్తిగా గ్రహించ గలగడానికి వీలుగా తలిదండ్రులకు తగు శిక్షణ నిచ్చేవిధానాలను రూపొందించడం అవసరం.

కుటుంబంలోని వారినడవడి, ఆచార సంప్రదాయాలు. అలవాట్ల ప్రభావం బిడ్డపై ఎక్కువగా ప్రసరిస్తుంది కనక బిడ్డ ప్రత్యేక వ్యక్తిగాగాక కుటుంబంలో అంతర్భాగంగా భావించబడాలనే నేను నొక్కి చెప్పగోరుతున్నాను. కనక ఏ సంక్షేమ సహాయమైనజరిగితే అది మొత్తంకుటుంబాని కంతకు సమన్విత పద్ధతులలోనే జరగ వలసివుంది.

## దాంపత్య విజ్ఞానం :

నాకు తెలిసి నంతవరకు భారతదేశంలో యువతీయువ కులకు దాంపత్య విజ్ఞానాన్ని గరపే చదువేమీ బోధించ బడడం లేదనే చెప్పగలను. స్త్రీలలో అనేక మందికి చదువుకొన్న వారికికూడా జననేంద్రియ విధులను గురించి గాని, అవి నిర్వహించే ప్రయోజనాలను గురించిగాని, తెలియదు. పెక్కుమంది తల్లులు తమ పిల్లలకు ఇలా చెయ్యాలి, అలా చెయ్యాలి, ఇదికూడదు, అదికూడదు అని చెప్పడం తప్పితే దాంపత్య జీవితానికి ముఖ్యమైన వనే హంశాలు యువతులకు తెలియనే తెలియవు. జీవితంలో మానవుడు అన్ని వ్యాపారాలలోను శిక్షణ నిచ్చే అవసరాన్ని గుర్తించిన ప్రజలు వైవాహిక సంబంధాలను గురించి తమ బిడ్డలకు శిక్షణ నిప్పించాలనే సంగతి గ్రహించక పోవడం విపరీతం.

వెనకటి కాలాల్లో ఆడపిల్లల చదువులో అత్తవారింటికి వెళ్ళాక తన వ్యక్తిత్వాన్ని. స్వాతంత్ర్యాన్ని భర్తకు, వదినామరదళ్ళకు. బావమరదులకు లోబరచి వర్తించాలనే నీతి గర్భితమై వుండేది. ఇప్పుడు మనం అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకూ విద్య చెప్పిస్తున్నాం జీవితంలోని అన్నిరంగాలలోను పురుషునితో సమానంగా పోటీ చెయ్యగల సమర్థతను పెంపొందిస్తున్నాం. ఈ కొత్త పరిస్థితులకు అనుగుణమైన భావోత్తేజాన్ని మాత్రం రూపొందించలేక పోతున్నాం.

## వధూవరులకు సలహాలు :

బిడ్డ వ్యక్తిత్వానికి అధికతర ప్రాధాన్య మివ్వబడు తున్న ఈనాడు వివాహ విషయాలలో కొంత చిక్కు తరచుగా ఏర్పడక తప్పడంలేదు. వివాహ సమస్య విషయంలో యువతీయువకులకు తగుసలహాలనిచ్చే ఏర్పాటు జరగాలి. ఇది పెళ్ళికి ముందైన జరగవచ్చు, తరవాతైనా జరగవచ్చు. ఈ ఏర్పాట్లు మన పరిస్థితులకు, ఆచారసంప్రదాయాలకు, వాతావరణానికి అనుగుణంగా జరగాలి. ఇద్దరుప్రత్యేక వ్యక్తులు వివాహంద్వారాఏకమై జీవితాన్ని గడపడానికి వీలుగా, తమ మధ్య ఏలాటి ఒడుదుడుకులు, విభేదాలు. ద్వేషాలు, కావేషాలు రాకుండా. అవి హృదయాలలో కలకాలం పెనవేసుకుని అశాంతికి అసౌఖ్యానికి దారితీయకుండా సుఖజీవితాలు గడపడానికి ఈ సలహాలు ఉపకరించాలి.

## కుటుంబ నియంత్రణం :

బిడ్డల విషయమై తలిదండ్రులు తీసికోవలసిన జాగ్రతలో కుటుంబ నియంత్రణావశ్యకత చేర్చ బడరాదని కొందరి అభిప్రాయం. కాని నామట్టుకు నాకు యిదిచాలా ముఖ్యమైనదని తోస్తుంది. కుటుంబనియంత్రణ సంఘానికి చెందినమేము కుటుంబంలో బిడ్డ ప్రవేశానికి తలిదండ్రులు సంతోషించడమేగాక, బిడ్డకు ఆహారం ఉడుపులు, ఆరోగ్య. విద్యాభివృద్ధులకు కావలసిన సమస్త సదుపాయాలను సమకూర్చాలని నొక్కి చెబుతాము. బిడ్డకు యివి అన్నీ సమకూర్చగల మన్న ధైర్యం కలిగిన సమయంలోనే దంపతులు బిడ్డకోసం ప్రయత్నించాలి. అది అదృష్ట వశాత్తు జరిగే సంఘటన కారాదు.

## తల్లులకు క్లబ్బులు :

చాలా తక్కువ సౌకర్యాలు గల తల్లులు తమ బిడ్డల పెంపులో ఎక్కువ శ్రద్ధాసక్తులు వహించ గలిగేటట్లు వారిలో ఉత్సాహం కలిగించడం కోసం తల్లుల క్లబ్బుల వంటివి స్థాపించడం అవసరం. అన్ని పెద్ద పట్టణాలలోను గ్రామాలలోను ప్రసూతి శిశు సంక్షేమ కేంద్రాలు ఏర్పాటు చెయ్యబడుతున్నాయి. బిడ్డలకు క్రీడాకేంద్రాలు .పార్కులు నెలకొల్ప బడుతున్నాయి. వీటి ఏర్పాటుకు భారత శిశు సంక్షేమసంస్థ, రాష్ట్రీయ సంఘాలద్వారా తగుప్రయత్నం చేసి ప్రోత్సహిస్తున్నది. ఇవిఅన్నీ వుండేభవనాలే తల్లుల క్లబ్బులకుకూడా ఉపయోగించ బడవచ్చు. తల్లులునెలకు ఒకటి రెండుసార్లుగాని, ఇంకా ఎక్కువగాగాని సమా

వేళమై తమకు ఉపయుక్తమైన ఫిలింప్రదర్శనలను చూడవచ్చు లేదా ప్రసంగాలను వినవచ్చు.

రోగం ముదిరిన తర్వాత చికిత్సకు పరుగెత్తడం కంటే నివారించడానికి ముందు యత్నించడమే మేలు అనే సంగతి తలిదండ్రులకు బాగా నచ్చేటట్లు చెయ్యాలి. ఎంత సాధారణమైన జబ్బులక్షణాలు కనిపించినప్పటికి తలిదండ్రులు తమ గ్రామాలలో, లేక పట్టణాలలో వుండే శిశు సంక్షేమ కేంద్రాలకు తీసికొని వెళ్ళి చూపించాలి. దీనివల్ల సరియైన సమయంలోనే నివృత్తి సాధ్యమై బిడ్డ సుఖజీవనాన్ని ప్రారంభించ గలుగుతుంది. ప్రసూతిశిశుసంక్షేమ కేంద్రాల, నిర్వహణ బాధ్యతను వహించే మున్సిపాలిటీలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే తల్లుల క్లబ్బులను, పిల్లల సంక్షేమసంఘాలను తామే తీసుకొని నడపవచ్చు.



## తల్లి దండ్రులు - ఉపాధ్యాయ సంఘాలు

పిల్లల మనస్తత్వాన్ని. వారి అలవాట్లను, నడవడిని పూర్తిగా గ్రహించడం కుటుంబ జీవితం మరింత సుఖదాయకంగా గడవడానికి దోహద మిస్తుందనే సంగతి అందరకు తెలిసినదే. తలిదండ్రులకు బిడ్డలకు మధ్య ఎంత ఎక్కువ సామరస్యం నెలకొంటే ఆ కుటుంబానికి అంత ఎక్కువ సౌఖ్యం లభించడమేగాక, బిడ్డల పౌరస్వత్వానికి కూడా దారితీస్తుంది. బిడ్డల అభివృద్ధికి విశేషంగా కారణభూతమయ్యేవి రెండు. ఒకటి కుటుంబం మరొకటి పాఠశాల. పెద్ద పెద్ద నగరాలలోను, పట్టణాలలోను చదువుకొనే పిల్లల సంఖ్య ఎక్కువగా వుండడం, చాలీ చాలని జీతాలుముట్టే ఉపాధ్యాయులు చదువు చెప్పడం ఫలితంగా బిడ్డ జీవితం 'ఇల్లు, బడి' అని రెండే రెండు విభాగాలుగా ఏర్పడిపోయింది. ఉపాధ్యాయునికి, కుటుంబంలో ఏంజరుగుతుందో అదిగాని, బిడ్డస్కూలులో ఎంచేస్తున్నదీ, ఎలా వున్నదీ తలిదండ్రులకు తెలియదు. వారు తెలుసు కొనడానికి యత్నించలేరుకూడా. రెండూ ప్రత్యేకరంగాలుగా వేరై పోయిన వీటిమధ్య సమన్వయం కుదిర్చి, బిడ్డల అభివృద్ధిని. విద్యను ఒకే సమస్యగా భావించి తగు కృషి చెయ్యడమే ఉపాధ్యాయ. తలిదండ్రి సంఘాలపని. పిల్లల చదువును గురించి మనస్తత్వాన్ని గురించి తమ స్వీయ సమస్యల దృష్ట్యా పరిశీలించి, పరస్పరంగా తలిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చించుకొనేటట్లు చెయ్యడమే ఈ ఉపాధ్యాయ తలిదండ్రి సంఘాల ప్రధానలక్ష్యం.

## పిల్లల శిక్షణలో విజ్ఞత :

బిడ్డ అల్లరి చేస్తే తల్లిగాని. తండ్రిగాని, వెంటరే కోప్పడడమో, మదలించడమో జరుగుతుంది. ఆ అల్లనే కొంచెం తీవ్రంగా జరిగితే దెబ్బలు కూడా తగులుతాయి. ఉద్రేకంవల్లనో, కొన్ని ప్రత్యేక పరిస్థితులలోనో ప్రతి బిడ్డ అప్పుడప్పుడు అల్లరి చెయ్యడం అతి సహజమైన విషయం. అయితే బిడ్డ అదేపనిగా మితిమీరి అల్లరి చేయడం ప్రారంభిస్తే విజ్ఞులైన తలిదండ్రులు కోపగించి కొట్టితిట్టి హడావిడి చెయ్యడానికిబదులు ఆ అల్లరికి కారణమేమో గ్రహించాలి. అలాఅల్లరి చెయ్యడానికి గాని చెడు బుద్ధులు అలవడడానికిగాని బిడ్డ మసలుతున్న వాతావరణంలోనిఅనభిలషితపరిస్థితులు కారణమౌతూవుంటాయి. ఆ అలవాట్లు బిడ్డను శిక్షించడంవల్ల తాత్కాలికంగా నిలిచిపోయి నప్పటికి ఆ తర్వాత మరొక వికృత రూపం పొందవచ్చు.

బిడ్డల పరిస్థితులను, మనస్తత్వాలను పరిశీలించడం ద్వారా, తలిదండ్రులకు శిక్షణ నివ్వడంద్వారా, వ్యక్తిత్వం లోని లోపాలను సవరింప జేయడంద్వారా శిశు సంరక్షణ సంఘాలు వారి సంక్షేమానికి కొంత కృషిచేస్తూవచ్చాయి.

## ఆరోగ్య వాతావరణం :

ప్రజలతో క్రిక్కిరిసిపోయి మురికిపేటల పరిస్థితులు వుండే పెద్ద పెద్ద నగరాలలోను, పట్టణాలలోను తలిదండ్రులు తమ బిడ్డల విషయంలో ఎక్కువ శ్రద్ధాసక్తులతో వర్తించడం కష్టసాధ్యమైన విషయం. వారి ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా వుండక పోవడం, వసతి సౌకర్యం లేకపోవడం, బిడ్డల ఆటపాటలకు తగు సౌకర్యాలు మృగ్యంకావడం వీటి ఫలితంగా బిడ్డలు వీధులలోనే ఆడుకొన వలసి వుండడం, అల్లరులకుదిగి చిక్కులలో పడడం సంభవిస్తూ వుంటుంది. ఈ పరిస్థితిలో బిడ్డలు చెడుదారులు త్రొక్కి బాలనేరస్థులుగా మారిపోకుండా వారించాలంటే పిల్లలకు, పెద్దలకు కూడా ఆటపాటలకు తగిన సౌకర్యాలు కలిగించడం ఉత్తమమార్గం కాగలదు. బిడ్డల పరిస్థితి ముందుగానే చక్కబరచడం మంచిదికాని ఆ తర్వాత వారిని ఏ ఆసుపత్రులకో, సంస్థలకో మానసిక వ్యాధులచికిత్సకు పంపడం మంచిదికాదు. అటువంటి సంస్థలలో వుండడంవల్ల ఆ తర్వాత వారు ఉద్యోగాలు, పనిపాటులు సంపాదించుకొనడం కష్టం కావచ్చు. ఇండియాలో బాలనేరస్థుల సంఖ్య ఎక్కువనే వున్నందున జ్యూవెనైల్ సర్వీసుబ్యూరోల వంటి వాటి స్థాపన ఉపయుక్తం కాగలదు. అనేకమంది బిడ్డలుండే సంస్థలలో చేర్పించి, డబ్బు ఖర్చుపెట్టే కంటే ఇంటిలో వుంచేచికిత్స చేయించడంకూడా అభిలషణీయం కాగలదు.

## కుటుంబ సంక్షేమ సంస్థలు :

అవకాశం వున్నంతవరకు ఆయా పట్టణాలలో క్రేందాలలో వుండే సంక్షేమ సంస్థలన్నిటిమధ్య సమన్వయం. సాధించడానికి కృషిచెయ్యదగు కుటుంబసంక్షేమసంస్థలను నెలకొల్పడం ప్రయోజనకరంకాగలదు. అవసరమైతే ఈ సంస్థలే వ్యక్తిగతంగా కూడా చికిత్సలకు పూనుకోవచ్చు.

తక్కువ సౌకర్యాలున్న ప్రాంతాలలో సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ఇరుగు పొరుగు గృహాల వంటివి స్థాపించడం కూడా ఎక్కువ ప్రయోజనకరం కాగలదు.

# సంఘ సేవిక తోడిసేవకులతో

[కేంద్ర సంక్షేమసంఘం అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ తమపెప్సూ, పంజాబ్‌లలో పర్యటన సందర్భంగా వేర్వేరుచోట్ల యిచ్చిన ఉపన్యాసాలలోని భాగా లివి. ఈ పర్యటనవర్తమానాన్ని పంపినది శ్రీమతి ప్రభారాయ్]

ఆరోగ్యవంతులైన చిన్న బిడ్డలుమీరు. మిమ్మల్ని వుద్దేశించే నేను మాట్లాడుతున్నాను. దేవుడు మీకు దృష్టిలోపం తెచ్చిపెట్టడం ఎంతో దురదృష్టం. మేము ఏనాటికైనా సూర్యోదయాన్ని చూడగలమా అనిమీరు ఆశపడుతూ వుండవచ్చు. ఏనాటికైనా మాజీవనానికి తగినంత సంపాదించు కొనగలమా? ఎప్పటికైనా మాకు పెళ్ళిళ్ళు అవుతాయా? జీవిత సుఖసంతోషాలను మేముకూడా అనుభవించ గలుగుతామా? అనిమీరు ఆలోచించు కొంటూ వుండవచ్చు. మీకు, మీ శ్రేయోభిలాషులకుకూడా "అవు" ననే నేను చెప్పగోరుతున్నాను. మీకందరకూ జీవితంలోని అవకాశాలు లభిస్తాయి. మీరందరూ విద్యావంతులౌతారు. మీ జీవనానికి కావలసినది సంపాదించుకో గలరు. ప్రపంచంలో జన్మించే ప్రతీ బిడ్డకు జన్మహక్కుగా లభించగల ఆవకాశాలు, సౌకర్యాలు అన్నీ మీకుకూడా లభిస్తాయి. మీ కోసమే ప్రభుత్వం ఈనాడు అనేక పరిశ్రమలను నెలకొల్పుతూ వుంది నేను మీతో యిక్కడ ప్రసంగిస్తూన్న సమయంలోనే మీ శ్రేయోభిలాషులైన నా మిత్రులు కొందరు మీకు పనిపాటులు కల్పించగల అవకాశాలను గురించి పరిశీలించే నిమిత్తం మునోస్సరులో సమావేశమౌతున్నారు.... ....

అంబాలాలో అంధబాలుర పాఠశాలలో

*    *    *

"నేను మీనుంచి నేర్చుకోడానికే వచ్చాను. కాని మీకు బోధించడానికి రాలేదు. మీతోకలిసి కూర్చొని మనహృదయాలను పరిశోధించు కొనడం కోసమే నేను వచ్చాను! మంచిపని జరిగితే మనలో "ఎతమందిమి దానిని హర్షిస్తాము? ఉన్నమాట ఉన్నదున్నట్లుగా అన్నందుకు మన్నించండి. మనతోటి కార్యకర్త కృషిని గురించి, కేవలంఅసూయకొలది దుష్ప్రచారంచెయ్యకుండా మనలో ఎంత మందిమి ఊరుకుంటాం? ఈ సంగతే మరొక విధంగా చెబుతాను. నిర్మాణాత్మకమైన కృషిచెయ్యాలనే వాంఛ మీకు ప్రబలంగావుంది. అయితే ఆకృషినిఎక్కడ ప్రారంభించాలనేది తెలియదు. ఏదైనా నిర్మాణాత్మకమైన కృషిని చెయ్యగోరే మిత్రులకు ఒకవిజ్ఞాపన చేస్తున్నాను. విమర్శనలు మానవలసిందని. నిర్మాణాత్మకమైన సూచనలు చెయ్యండి. మీరు కోట్లకొలది రూపాయలను సంపాదించుకోగలరేగాని ఒకసారి కార్య కర్తను కోల్పోయినా రంటే తిరిగి సందింపాచుకోలేరు. అనవసర విమర్శలు చేసి అప్రస్తుత ప్రసంగంచేసి మీరు కార్యకర్తలోని ఉత్సాహాన్ని చంపివేశారంటే ఎంతడబ్బిచ్చికూడా తిరిగి అతనిని సంపాదించుకోలేరు....కోట్లకొలది ధనాన్ని సమకూర్చుకొనడం కష్టంకాదు. మనకు కోట్లకొలదిగా ద్రవ్యం వుంది. కాని ఆ ద్రవ్యాన్ని సద్వినియోగం చెయ్యడమే కష్టం. మన కృషి బ్రహ్మాండమైనది. దీనిని కొనసాగించడంలో మీ అందరి సహాయం నాకు కావలసివుంది. ఏ రంగంలో మీరు నాకు సహాయపడగలరో నిర్ణయించుకోవచ్చు. ఇతరులతో మీరు పోటీ పడవలసిన పనిలేదు. మీరు ఏ రంగంలో పనిచెయ్యదలచు కొంటారో నిర్ణయించుకొని ఆపనే చెయ్యండి. ఒకే సమయంలో అనేక సంఘాలలో ప్రవేశించవద్దు. అన్నిపనులకు మీరున్యాయం చెయ్యలేరు. అన్నిపనులను పూర్తిగా నిర్వహించలేరు. సంఘసేవ చాలా కష్టమైనది. ఈ రంగంలో సాధించబడిన విషయాలు ఒక్కరి కృషి ఫలితంకావు. మీరు పనిచేసే సంస్థకు ఎవరునాయకులైవుంటేనేమి. మీ శక్తికొలది మీరు కృషి చెయ్యండి. ఒక్క ఇటుకతోనే గోడ కడతామా? దాని నిర్మాణానికి ఉపయోగించబడే ప్రతీ యిటుక గోడకు బలాన్ని సమకూర్చుతుంది. అలాగే ప్రతీ సంఘసేవకుడు సేవిక చేసే కృషి మొత్తంమీద ఫలితాన్నిస్తుంది. మీకు సంబంధంలేని ఒక ఉద్యమాన్ని నేడు మీరు విమర్శిస్తారు. ఆ ఉద్యమ నిర్వహణ భారం

## సంఘ సేవిక తోడి సేవకులతో

వహించ వలసినదిగా రేపు మిమ్మల్నే కోరితే ఆ ఉద్యమ కార్య క్రమాన్ని గురించి అంతకు ముందు కలిగిన మీ అభిప్రాయం మార్చుకో గలుగుతారా? అంతకు ముందు రోజున మీరు విమర్శించిన పనిని హర్షించ గలుగుతారా? అలా చెయ్యలేరు. ఎవరూ తన స్వంత ఉద్యమాన్ని గురించిచెడుగా మాట్లాడలేరు. మీఅభిప్రాయాన్ని మార్చు కున్నానంటే లోకం మీకు మతి పోయిందంటుంది. ఒక్కొకసారి నాకు వచ్చే విమర్శనలను చూసిన కొలది నాకు ఎంతో విసుగు పుడుతుంది. ఏంపని జరుగుతుందో చూడకుండానే మన ప్రయత్నాలను నిరసించే వారిని చూడనా లేక మన కేంద్రాలనుంచి లబ్ధిపొందే అమాయిక ముఖాలనవలోకించనా? సంతోషంతో ఉత్తేజితములైన వారి ముఖాలను చూస్తే, నా చిక్కులను నేను మరచి పోతాను. మానవజాతి శ్రేయస్సు కోసమే మీరూ నేనూ పనిచెయ్య గోరుతున్నాం. మీరూ, నేనూచెయ్యదగు సహాయానికి చూపదగు మార్గాలకు వేచివున్న లక్షలాది ప్రజల కోసమైనా మీరు కూర్చొని మీ చిక్కులను పరిష్కరించు కోవాలి. మీ విభేదాలను తొలగించుకోవాలి....

చండీఘుర్ మహిళా సమావేశంలో

* * *

ఈ కేంద్రానికి రావడం నాకు ఎంతో సంతోషం కలిగించింది. కమ్యూనిటీ ప్రాజెక్టులలోని స్త్రీలకు సంబంధించిన కార్యక్రమాలకు, బిడ్డలకు సంబంధించిన కార్యక్రమాలకు మధ్య సమన్వయం కుదర్చడం విషయమై కొన్ని రోజులుగా మేము తీవ్రంగా యోచిస్తున్నాము. కమ్యూనిటీ ప్రాజెక్టు, సంక్షేమ వికాస కార్యక్రమాలు రెంటినీ సమన్విత పద్ధతిలో నిర్వహించే కార్య క్రమాన్ని నేను యిక్కడ చూస్తున్నాను. ఇది విశేషంగా ఫలించింది. ఈ కార్యక్రమాన్ని మనకు పూర్తిగా నిర్వహించ దలచుకొని వుంటే వేతనాలు తీసుకొనే కార్యకర్తలుగాక 50,000 మంది స్వచ్ఛంద సేవకులుకూడా కావలసి వుండేవారు. మీ సహాయసంపత్తులు లేకుండా, మా సహకారంలేకుండా ఏ వ్యాఖ్యానం చెయ్యడానికైనా నాకు సాధ్యపడి వుండేది కాదు....

పెప్సూలోని జంగ్‌పురా కేంద్రంలో

మా ప్రాజెక్టులను ఎంత ఎక్కువగా చూస్తే నా మనస్సులో మీరిచ్చిన స్వాగతానికి అంత ఎక్కువగా సంతోషం కలుగుతుంది. పట్టణాలలోను నగరాలలోనుగల తమ ఇళ్ళను, వాకిళ్ళను వదిలి మీలోకలిసి పని చెయ్యడానికి వచ్చిన గ్రామసేవికలకు మీరు సాయపడి, సహకరించక పోయివుంటే వారు యిక్కడ ఒక్కరోజు పనిచెయ్యలేక పోయివుండేవారు. ఈ గ్రామసేవికలు తమ జీవితాలను స్త్రీల, శిశువుల సంక్షేమకృషికి అంకితం చేసి వున్నారు. వారు తమ కార్యభారాన్ని నిర్వహించగలగడానికి వీలుగా మీ పిల్లలను వారు చేస్తున్న కేంద్రాలకు పంపగోరుతాను. మనదేశంలో ప్రస్తుతంలో యిటువంటి కేంద్రాలు రెండు వేలు పనిచేస్తున్నవి. వచ్చే అయిదేళ్ళలోను వీటిసంఖ్య మరి నాలుగురెట్లు హెచ్చగలదు. అలాగే మాకార్యకర్తల సంఖ్యకూడా హెచ్చవలసి వుంది. మా కేంద్రాలకు మీరు యిప్పుడు పంపే పిల్లలు ఒకటి రెండేళ్ళలో గ్రామ సేవికలుగా మరొకచోట పనిచెయ్యవచ్చు. ఈ యువసేవికలను నేను హృదయ పూర్వకంగా ఆశీర్వదిస్తాను.......

అమృతసర్ జగదేవ్ కలాన్‌లో



# దౌలేషా మూషికాలు

★

శ్రీ సదత్‌హస్సన్ మింటో

వివాహంనాటికి సలీమా వయస్సు 21 సంవత్సరాలు. పెళ్ళి జరిగి అయిదు వసంతాలు గడిచిపోయినై. అయితే ఆమెకు బిడ్డలు కలగలేదు. ఆమె తల్లికి. అత్తగారికి యిది చాలా ఆందోళన కలిగించింది. నజీబ్ మళ్ళా పెళ్ళి చేసుకొంటాడేమో అనివారు భయపడ్డారు. అనేకమంది వైద్యులను సంప్రతించారు. వారి ప్రయత్నాలేవీ ఫలించలేదు.

సలీమాకూడా ఎంతో ఆందోళన పడింది. తరుచుగా తన తల్లి సలహాతీసుకొని, దానికి అనుగుణంగానే ప్రవర్తిస్తూవుండేది. అప్పటికీ ఫలితం లేకపోయింది.

ఒకరోజున ఆమెను చూడడానికి ఫతీమా వచ్చింది. ఫతిమా ఆమె స్నేహితురాలు. ఆమెకు కూడా పిల్లలులేరు ఆమెనుకూడా గొడ్రాలు అన్నారు వైద్యులు. అయితే ఈ సారి ఆమె వచ్చినప్పుడు ఆమె చంకను ఎంతో చక్కని బిడ్డ వుంది. ఈ బిడ్డ ఎలాకలిగాడు ఫతీమా అని సలిమా ఆశ్చర్యంగా అడిగింది. తనకంటే ఫతీమా అయిదేళ్ళు పెద్దది. ఆమె నవ్వుతూ అంది: షా దౌలా ఆశీర్వచన ప్రభావమిది. నా స్నేహితులొకరు చెప్పారు. బిడ్డకావాలంటే షా దౌలా సమాధివద్దకు వెళ్ళి ప్రార్థించ వలసిందని అప్పుడు బిడ్డలు కలుగుతారంది. అయితే ముందుకలిగిన బిడ్డను ఆ సమాధికే యిచ్చివేయాలనే షరతు వుందన్నది. ఆ షరతును తప్పక పాలిస్తే ఆతర్వాత మళ్ళీ సంతానం కలుగుతుందని ఆమె అన్నది.

సమాధి దగ్గరచేసే ప్రార్థనల ఫలితంగా మొదటపుట్టే బిడ్డతల మరీ చిన్నదిగా వుంటుందని, తనకు ముందు ఈ మాట రుచించలేదని, అయితే తాను ఆ మొదటి బిడ్డను సమాధి నిర్వాహకులకు యిచ్చివేయాలనే తెలియవచ్చినపుడు ఎంతోబాధ కలిగిందనీ ఫతీమా చెప్పింది.

“బిడ్డ ముక్కు తప్పట ముక్కు కావచ్చు. పిల్లి కళ్ళు అయివుండవచ్చు. శిరస్సు చిన్నదై వుండవచ్చు. అయితే మాత్రం ఏ తల్లికి తన బిడ్డను కుళ్ళు కాలవలో పారవేయడానికి ఎలా బుద్ధి పుడుతుందీ? అలాటి పనులు చేసేది నారీ రూపంలోని రాకాసి అయి వుండాలి” అనుకొంది సలీమా.

అయితే ఆమెకు బిడ్డలు కలగాలనే కోరిక అగ్గలంగా వుంది. అందుచేత తనకంటెవయస్సులో పెద్దదీ, ఎక్కువ అనుభవం కలదీ అయినా ఫతీమాహితవు ప్రకారమే నడుచుకోడానికి నిశ్చయించుకొంది. తాను ఫతీమాతో కలిసి ఒకసారి గుజరాత్‌కు వెళ్ళిరానా అని భర్తను అడిగింది. ఆయన సరే కాని త్వరగా తిరిగిరా అన్నాడు.

సలీమా ఫతీమాతో కలిసి గుజరాత్‌కు వెళ్ళింది. షా దౌలా సమాధివున్న చోటు తనుముందు ఊహించినంత పెద్దదికాదు. అయితే చక్కగావుంది. సలీమాకు ఆభవనం నచ్చింది. అక్కడ ఎన్నో చిన్న చిన్న గదులున్నాయి. వాటిలోని మానవమూషికాలను ఆమె చూసింది. అస్తమానం వాటి ముక్కులనుంచి నీరుస్రవిస్తుంది. వాటికి వివేచనా శక్తిలేదు. “ఆ మూషికాలను” చూడగానే ఆమె భయంతో కంపించి పోయింది.

ఆ మానవమూషికాల్లో ఒక అమ్మాయివుంది, శారీరకంగా ఆమె బొద్దుగా పెరిగివుందికాని ఆమె చర్యలు హాస్యంగా వున్నాయి. సలీమాకు ఆ చర్యలను చూస్తే నవ్వు వచ్చింది. అయితే మరుక్షణంలోనే ఆమె కళ్ళు అశ్రుపూరితములైనాయి. ఆమెతల చిన్నదిగా వుంది. తల చిన్నదైతే తలంపులు కూడా చిన్నవికావాలా అనుకొంది. ఆమె నవ్వు, నడక, మాట అన్నీ చూస్తే రబ్బరు బొమ్మను చూసినట్లుంది.

ఇవి అన్నీ చూసిన తర్వాతకూడా సలీమా ఫతీమా చెప్పినట్లే మనఃపూర్వకంగా సమాధివద్దప్రార్థనలుచేసింది తనకు మొదట కలిగిన బిడ్డను సమాధికి అర్పిస్తానని దణ్ణం పెట్టుకొంది. అక్కడ ఒక నెల రోజులుండి యింటికి తిరిగి వచ్చింది. తిరిగి వచ్చిన తర్వాతకూడా ఔషధసేవ చేసింది. రెండు నెలలు గడిచినై. తాను గర్భవతినని ఆమె గ్రహించింది. ఆమెకు ఎంతో సంతోషం కలిగింది. నెలలు నిండినపిదప ఆమె మగ బిడ్డను కన్నది. ఆ బిడ్డ ఎంతోఅందంగా ఆరోగ్యంగా వున్నాడు. అయితే తాను గర్భవతిగా వున్న రోజులలో చంద్రగ్రహణం సంభవించిందేమో

బిడ్డ ఎడమ బుగ్గమీద నల్లని పుట్టుమచ్చవుంది. ఆ పుట్టు మచ్చ బిడ్డ ముఖానికి వికారంగా లేదు. మరింత అందమిచ్చింది.

ఫతీమా సలీమాను చూడడానికి వచ్చింది. బిడ్డను సమాధికి ఇచ్చివేయ వలసిందేనని ఆమెసలహాయిచ్చింది.

సలీమా దీనికి సమ్మతించింది. కాని ఆమెలోని మాతృత్వం తన ముద్దు బిడ్డను షా దౌలా కిచ్చివేయడానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది.

షా దౌలావద్ద ప్రార్థనల ఫలితంగా జన్మించే బిడ్డల తలలు చిన్నవిగా వుంటాయనే ప్రతీతికి భిన్నంగా తన బిడ్డ తల మామూలుగా అందరు బిడ్డలకు వున్నట్లేవుంది. ఇటువంటి సాకులకు అవోహలకు తావీయరాదని, బిడ్డకు అనుకొన్న ప్రకారం ఆ సమాధి నిర్వహిస్తున్న వారికి యిచ్చిరావలసిందే అని ఫతీమా చెప్పింది. ఈ వాగ్దానం నెరవేర్చని వారు నానాయాతన అనుభవిస్తారని అది శాపమని ఫతీమా హెచ్చరించింది కూడా.

సలీమా అతిభారమైన హృదయంతో తనముద్దుబిడ్డను అక్కడివారికి యిచ్చివేయవలసి వచ్చింది. ఆ తర్వాత ఆమె గుండె పగిలిపోయేటట్లు ఏడ్చింది. ఆమెకు అశాంతి కలిగింది. బిడ్డకోసం బెంగ పెట్టుకొని మంచం పట్టింది కూడా. బిడ్డ బుగ్గమీది పుట్టుమచ్చ సలీమాకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తూవుంది. ఆమెకు ప్రతిరోజూ ఏవో కలలు వస్తూ వుండేవి. ఒక్కొక్కసారి ఆ స్వప్నంలో పెళ్ళి ఎలుక తనమీదికి వచ్చి పళ్ళతో తన శరీరాన్ని కొరికి మాంసం పెకలించుకొని తింటున్నట్లుగా తోచేది. దానితో ఆమె భయపడి కేకలు వేసి ఆ ఎలుకబారినుండి తన్ను కాపాడ వలసిందని భర్తను కోరేది.

కొన్ని సమయాలలో తనబిడ్డ ఎలుక కన్నంలో చొరబడ్డదని బయటకి రాబోతూ వుంటే మిగిలిన ఎలుకలు రానివ్వకుండా అడ్డుపడుతున్నట్లు తోచేది. మరో సమయంలో ఆ సమాధి దగ్గర హాస్యపు చేష్టలు చేస్తూ కనిపించిన అమ్మాయి రూపం మనోవీధిని సాక్షాత్కరించేది. ఆ పిల్ల కనబడగానే సలీమా నవ్వేది తిరిగి ఏడ్చేది. ఇదంతాచూసి సలీమాను ఓదార్చడమే ఆమెభర్త నజీబ్‌కు పెద్ద సమస్య అయింది.

ఆమెకు ఇల్లంతా ఎలుకలు తిరుగుతున్నట్లే తోచింది. పరుపుమీద వంటింట్లో సోఫామీద, తన హృదయంలో ఎక్కడపడితే అక్కడ అవి పరుగెడుతున్నట్లు కనిపించింది. ఒక్కొక్కపుడు తానే ఎలుకగా మారిపోయానని భావించేది. ఇదంతా జ్వరంలో. జ్వరం తగ్గింది. నజీబ్ మనస్సు స్థిమితపడ్డని. ఆయనకు తన బిడ్డను సమాధికి సమర్పించడంపట్ల విచారం కలగలేదు. అది సరియైనపనే అని ఆయన అనుకొన్నాడు.

ఈ సంఘటనను నేను ఎన్నటికి మరువలేను. నేను బ్రతికి వున్నంతకాలం ఆబిడ్డకోసం నా మనస్సులో చిచ్చు రగులుతూనే వుంటుంది. అంది ఒకసారి ఆమె ఉన్నట్లుండి మాయమైంది. తిన్నగా గుజరాత్ వెళ్ళింది. ఆ సమాధిని దర్శించింది. కాని తనబిడ్డ కనిపించలేదు. విఫల మనోరథయై తిరిగి వచ్చింది. ఆ తర్వాత కూడా చాలా రోజులపాటు ఆ బిడ్డ కోసమే మనస్సులో బాధ పడుతూ వుండేది.

ఏడాది గడచింది. ఆమెకు ఆడపిల్ల కలిగింది. ఆ పిల్ల అచ్చంగా అంతకుముందు పుట్టిన మగబిడ్డలాగే వున్నాది అయితే పాపాయికి బుగ్గమీద పుట్టుమచ్చలేదు. తనబిడ్డకు పెట్టుకొందామన్న ముజీబ్ పేరునే సలీమా ఆడపిల్లకు పెట్టింది. రెండునెల్లు గడిచిన పిదప ఆమె కాటుకతో పిల్ల బుగ్గమీద చిన్న పుట్టుమచ్చలాగ గుర్తు పెట్టింది. వెంటనే మగబిడ్డ జ్ఞాపకానికిరాగా ఆమె కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. చీరచెంగుతో ఆకన్నీటిని తుడుచుకొంది. ఆ విచారాన్ని మరిచిపోడానికి యత్నించింది.

తర్వాత సలీమాకు యిద్దరు బిడ్డలు కలిగారు. ఆమె భర్తకు ఎంతో సంతోషం కలిగింది. ఒకసారి ఏదో పెళ్లి సందర్భంగా ఆమె గుజరాత్ వెళ్లవలసి వచ్చింది. అప్పుడు కూడా ముజీబ్ కనిపిస్తాడేమో అని చూసింది. కనబడ లేదు-ఆ బిడ్డ చనిపోయి వుంటాడనుకొంది. గురువారం నాడు ఆ బిడ్డ కోసం ప్రార్థనలు కూడా చేసింది.

సాయంకాలం ముజీను పిలిచి, ఆమె బుగ్గ మీద కాటుకతో పుట్టుమచ్చలా చుక్కపెట్టి దగ్గరకు తీసుకొని ఎన్నో సార్లు ముద్దు పెట్టుకొంది.

తన మగ బిడ్డకు 'మనస్సులో' వున్న స్థానాన్ని ముజీబా తీసుకొంది. గురువారం నాడు ప్రార్థనలకు పిమ్మట ఆమెకు చాలా ఉపశమనం కలుగుతూ వచ్చింది. తన హృదయంలోనే ఆనాటి మగ బిడ్డకు చిన్న సమాధిని

కల్పించుకొని, నిద్రలో పూలు సమర్పిస్తున్నట్లు కల గనేది.

సలీమా ముగ్గురు పిల్లలూ యిప్పుడు బడికి వెడు తున్నారు. ఉదయం వారిని నిద్ర నుంచిలేపి, నీళ్ళు పోసి, ఉడుపులిచ్చి, భోజనం పెట్టి, మధ్యాహ్నానికి ఫలహారం అమర్చిపెట్టి అన్ని సపర్యలూ చేస్తూ వుండేది. అయితే ఆ మగ బిడ్డను, ఆ బిడ్డ యొక్క బుగ్గమీద పుట్టు మచ్చనూ ఎన్నటికీ మరువ లేకపోయింది.

ఆ మచ్చ వ్రణంలా ఆమె మనస్సుకు బాధ కలిగి స్తూనే వుంది.

ఒక రోజున ముగ్గురు పిల్లలూ సలీమా దగ్గరకు పరుగెత్తుకొని వచ్చారు. "అమ్మా! ఆ బిడ్డ ఎవరో తమాషా చేస్తూన్నాడే, మన యింటికి పిలుచుకు రామా?" అని ఉత్సాహంతో అడిగారు.

"తీసుకురండి, కాని ఇంట్లోకి కాదు, వీధిలోనే ఆ ఆటా, వినోదమూను" అందిసలీమా.

ఆ అబ్బి వచ్చాడు. ఇంటిముందు వీధిలో ఎన్నో తమాషాలు. చేశాడు. సలీమా ఆ అబ్బికివ్వడానికి నాలు గణాలు తీసుకొని వరాండాలోకి వచ్చింది. ఆమె అక్కడ తమాషాచేస్తున్న అబ్బిని—ఆ పిల్లలను చూసి నిశ్చేష్ట రాలయింది. తన బిడ్డ!

తాను ఆనాడు దౌలేషా సమాధికి అప్పగించివచ్చిన ముజీబ్ ఆ అబ్బితో ఉన్నాడు. ఆ బిడ్డను పిలచింది. లోపలకు తీసుకువెళ్లింది. హృదయానికి హత్తుకొంది. కాని అతడు తెలివి తక్కువ వానిలా ప్రవర్తిస్తున్నాడు.

"నా కన్నతండ్రివి నువ్వు, నీ తల్లిని నేనేనాయనా!" అంది సలీమా అనురాగం వుట్టి పడేలా.

"పైసా యియ్యమ్మా" అన్నాడు ఆ బిడ్డ. తను పర్సు తీసింది. ఆ ఆటఆడిస్తూన్న ఆ అబ్బి చేతికివంద రూపాయల నోటు యిచ్చింది. అంత తక్కువ మొత్తానికి బిడ్డను అమ్మడానికి అతడు నిరాకరించాడు. 500 రూపాయలిమ్మని అన్నాడు. అయిదు వందలూ యిచ్చి ఆమె లోపలికి వచ్చింది. కాని ఆ బిడ్డ అక్కడలేడు. దొడ్డి దారిని పారి పోయాడు.



# సంక్షేమ కేంద్రాలు - కార్యకలాపాలు

## విశాఖ జిల్లా సంక్షేమ విస్తరణప్రణాళికా కేంద్రము నందు దసరా యుత్సవము.

విశాఖ జిల్లా మింది గ్రామమునందు స్థాపింప బడిన సంక్షేమ విస్తరణ కేంద్రమునందు పిల్లలచే దసరా బొమ్మల కొలువు పెట్ట బడెను. గ్రామమునందు గల బాల బాలికలకు అల్లికలు, కుట్లు, ఆటల పోటీలు, జరుప బడెను. దేశనాయకుల పటములు, ఆదర్శగ్రామ నమూనాలతో పిల్లలను ఆ బొమ్మలకొలువు ఎంతో ఆకర్షించినది. దసరా ఆఖరిరోజున జిల్లా సంక్షేమ శాఖ జాయింట్ కన్వీనరు శ్రీ దిగుమర్తి రామస్వామిగారు, ఆర్గనైజరు కుమారి సీతాలక్ష్మి మింది గ్రామమునందు శ్రీ ఈటి శ్రీ ఆత్రేయనాయుడుగారి అధ్యక్షతను సభ జరిపించి. బాల బాలికలకు బహుమతులు మిఠాయిలు పంచిరి. దసరా యుత్సవములు జయప్రదముగా ముగిసినవి.

## నెహ్రూజీ జన్మదినోత్సవము

సమాజ కల్యాణోపకేంద్రమగు మిందిగ్రామములో భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూగారి 68వ జన్మదినోత్సవము కడు శోభస్కరముగా జరుప బడెను. గ్రామస్థుల శ్రమదానముతో చాలాకాలము శిథిలమైయున్న రహదారీ కొంతవరకు మరమ్మతు చేయ బడెను. ఇంతకుముందు బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీ వెంకటేశ్వరరావుగారు ఈ కార్యక్రమమును శ్రీ దిగుమర్తి రామస్వామిగారిచే ప్రారంభోత్సవము చేయించిరి. జన్మదినోత్సవమున బాలబాలికలకు ఆటల పాటల పోటీలు జరిగి గెలుపొందినవారలకు (సుమారు 35 మందికి) శ్రీమతి శాంతి కామత్‌గారిచే బహుమతులొసంగబడెను. ఉత్సవ కార్యక్రమమును ప్రారంభించుచు రామస్వామిగారు కలెక్టరు దంపతులకు, వారి సోదరిగారికి, తల్లిగారికినికూడా స్వాగతమునొసంగిరి. శాంతి కామత్‌గారు జాతీయపతాకమునెగురవేసిరి. శ్రీ కలెక్టరుగారు తమ ప్రారంభోపన్యాసములో సంక్షేమ శాఖవారు కావించుచున్న సేవాకార్యములు శ్లాఘించిరి. నెహ్రూగారి అద్భుత చరిత్రను, అమోఘ నాయకత్వమును, వర్ణించుచు కన్వీనరు జానకీబాయమ్మగారు ఉపన్యసించిరి. బాలికలచే నృత్యగానములు ప్రదర్శింపబడినవి. పిమ్మట కామత్ దంపతులు కల్యాణకేంద్రగృహమును, అచ్చట గ్రామసేవిక శ్రీ వెంకటరత్నమ్మగారు చేయించిన కుట్లు పనులు, అప్పడములు, కుంకుమ వగైరాలను అధ్యక్షులకు చూపి వారి అభినందనలను బడసిరి. శ్రీమతి అనసూయాదేవిగారు (స్త్రీజనాభ్యుదయ శాఖోద్యోగి) కామత్ దంపతులకును, మిందిగ్రామ కమిటీ సభ్యులకు వెంకటేశ్వరరావు ప్రభృతులకును చందనములు దెల్పిరి. జనగణమన గానముతో సభ జయప్రదముగా ముగిసినది.

## విశాఖ జిల్లా సంక్షేమ విస్తరణ కేంద్రములలో ఆంధ్ర ప్రదేశ్ అవతరణోత్సవము.

విశాఖ జిల్లా శ్రీహరిపురం సంక్షేమ కేంద్రంలో నవంబర్ 1 వ తేదీని శ్రీ దిగుమర్తి రామస్వామిగారి అధ్యక్షతను, ఆంధ్రప్రదేశ్. అవతరణ మహోత్సవము జరుపబడెను. కుమారి సీతాలక్ష్మిచే పతాకోత్సవము జరుపబడినది. ఆ దినము సభ యందు శ్రీ కామాడ అప్పల నరసయ్యగారు, శ్రీ పైడయ్యగారు, తదితర గ్రామస్థులు నవంబర్ 1 వ తేదీవిశిష్టతను గూర్చి, సంక్షేమ కేంద్రమునకు తాము యివ్వదల్చుకున్న సహకారమును గూర్చి మాట్లాడిరి. శ్రీహరిపుర గ్రామస్థులు కలసి కేంద్రమునకు సేకరించిన విరాళము రూ 65/- (అరువదిఐదు రూపాయలు) కేంద్ర ప్రయోజనార్థము సమర్పించిరి. బాల బాలికలకు మిఠాయిలు పంచ బడెను సభ జయప్రదముగా ముగిసెను.

తరువాత శ్రీ రామస్వామిగారు, కుమారి సీతాలక్ష్మి గాజువాక, మింది, గ్రామముల యందు ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవము జరుపుటకు ఆ గ్రామములకు వెళ్ళిరి. మింది గ్రామమునందు ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవము ముగిసిన వెంటనే ప్రజల కోరికపై. శ్రీ రామస్వామిగారు గ్రాండ్‌ట్రంక్ రోడ్డునుంచి గ్రామమునకు వచ్చు రోడ్డునకు ప్రారంభోత్సవము జరిపిరి. పలువురు ఈ యుత్సవమునకు హాజరైరి.

# హితకారిణీ సమాజం

రాజమండ్రి, తూర్పుగోదావరి.

**స్థాపితం:**

1907 (రిజిస్టర్డు)

**వ్యవస్థాపకులు:**

శ్రీ రావు బహదూర్ కందుకూరి వీరేశలింగం పంతులు.

**అధ్యక్షులు :**

శ్రీ నాళం కృష్ణారావు.

**కార్యదర్శి:**

శ్రీ యేసంరెడ్డి వెంకటరావు.

**ఆశయములు, ఆచరణలు:**

వితంతుగృహములు, అనాథాశ్రమములు, రక్షణశాలలు, బాలబాలికా పాఠశాలలు, పారిశ్రామిక సాంకేతికాగారాలు, ఇంకా ఆ శాఖలకే చెందిన విద్యాబోధకనిలయాలను స్థాపించి నడపించుట.

**కార్యక్రమాలు:**

ఈ సమాజం ప్రస్తుతం ఒక ఆస్తికోన్నతపాఠశాల, అదే పేరున గ్రంథాలయము, ప్రార్థనాసమాజము, మ్యూజియము, ఒక వితంతుశరణాలయము నడిపిస్తున్నారు—అందున్న బాల వితంతువులకు సక్రమ విద్యాబోధ జరుగుతూంది. ఇంకను కొంతవయసు మీరిన వితంతువులకు స్కూలునందుకాక ప్రయివేటుగా విద్య గరపబడుచున్నది. నూలువడకుట, నవారునేత, కుట్టుపని, లేసుఅల్లిక వీటిలో అందరికీ శిక్షణ ఈయబడుతూంది. శిక్షణగృహము, అనాథాశ్రమము, బాలికాపాఠశాల రాబడి లేమిచే కొంతకాలం ఆపివేయబడినా, తిరిగి ఇటీవలనే నడుపబడుచున్నవి.

**ఆదాయము:**

మొత్తము సాలుసరి రాబడి రూ 6, 600/– వరకూఉంది. ఖర్చు రూ-17, ?00/– ఇళ్లఅద్దెలవలన, భూవసతినుండి, తోటలమీద, సభ్యత్వచందా రూ8/- యావజ్జీవచందా రూ100/– ల వల్లనే రాబడి వచ్చుచున్నది. కేంద్రసాంఘికసంక్షేమసంస్థ 1953-54 సంవత్సరము స్త్రీ సంక్షేమ శాఖలుప్రారంభించుటకుగాను రూ 10,000/-లు మంజూరు చేసింది

ఈ సంఘమున ఒక గౌరవ కార్యదర్శి, (వారే ఉత్తరప్రత్యుత్తరములను గమనించేది.) 52మంది వేతనములనందుకొని పనిచేయువారు కలరు. ప్రార్థనసమాజమునకు ప్రత్యేకముగా నొక గౌరవకార్యదర్శి కలరు. ఈ సమాజగృహము 108 మందికి నివాసయోగ్యము అయినా 66గురు మాత్రమేఉన్నారు.

— "సోషల్ వెల్‌ఫేర్ ఇన్ ఇండియా"నుండి.

# ANDHRA MAHILA SABHA

## NURSING HOME & NURSES' TRAINING CENTRE

REPORT FOR OCTOBER 1956

### IN-PATIENT MATERNITY

| | |
|---|---|
| No. of Patients admitted for Deliveries | 145 |
| ,, ,, Surgical cases treated | 1 |
| ,, ,, Medical cases treated | 39 |
| ,, ,, Gyneac and Abortions | 30 |
| ,, ,, Post Natal | 3 |
| ,, ,, babies (Lodgers) | 110 |
| Grand total | 328 |
| ,, ,, normal Deliveries | 102 |
| ,, ,, abnormal Deliveries | 7 |
| forceps 3<br>Internal Podalic Version 1<br>Breech 2<br>Face 1 | 7 |
| Total | 110 |

### OUT-PATIENT DEPARTMENT

| | |
|---|---|
| No. of Surgical cases | 102 |
| ,, ,, Medical cases | 1015 |
| ,, ,, Gyneacological cases | 150 |
| ,, ,, Ante-natal cases | 231 |
| ,, ,, Post-natal cases | 118 |
| ,, ,, E.E.N.T. cases | 64 |
| Total No. of New patients | 1670 |
| Total No. of Old patients. | 1907 |
| Grand Total | 3577 |

### NURSES' TRAINING CENTRE

The first batch of Auxiliary Nurse Midwives discharged from the institution, numbering 11, are all employed now. The second batch of 30 trainees completed their training in July and will be taking their final examination this month. They will all be immediately taken into service, some in the Community Development Blocks, Andhra Government and the rest in the Welfare Extension Projects, Andhra State. The 3rd batch of 15 trainees will do their first examination during this month. The 4th batch of 15 trainees will do their first examination in December. The 5th batch of 30 trainees are admitted on the 1st of August. The strength at present is 60 excluding the 30 that are waiting for their examination.

Mrs. V. LAKSHMI PARVATHI
*Secretary and Convenor*
Mrs. A. C. KRISHNA RAO
*Administrative Secretary*

Dr. M. PAVANA BAI
*Medical Superintendent*

# మహిళా సమాజములు

## మహిళా సంఘము

### శ్రీకాకుళము

అక్టోబరు 1వ తేదీని ఆంధ్రరాష్ట్ర దినోత్సవ సందర్భమున ఉదయము 8-30 గంటలకు సంఘము అధ్యక్షురాలగు శ్రీమతి టి. చిరంజీవులుగారిచే జాతీయ పతాకము ఎగురవేయబడెను.

మధ్యాహ్నకార్యక్రమము:- సభ్యులకు అల్పాహార విందు. పిమ్మట శ్రీమతి యమ్. గౌరిగారిచే వీణా వాయిద్యము చాలా వైభవోపేతముగా సభ్యురాండ్రు జరుపుకొనిరి. శ్రీమతి గుడివాడ సూర్యకాంతం కార్య దర్శినిగారి వందనసమర్పణముతో వీణాగానము ముగించబడెను.

## ఆదికవీ !

### శ్రీమతి శిష్టా బాల

మ॥ అసమగ్రంబఁట భాష; దివ్యకవితా
వ్యాసంగమేలేదు, నాఁ
డసలేలేవఁట గ్రంథముల్ దెలుఁగునం
దంచున్ మహాపండితుల్
దెసలంజాటిరి ; యెట్టులట్టి కవితన్
దివ్యంప్రవాహోపమ
ప్రసరన్మూర్తి రచింపఁగల్గితివహో !
స్రష్టన్ విడంబించుచున్ ॥

ఉ॥ నమ్మగ లేనుసత్కవులు
నాఁడురచించియె యుందురెల్లలో
కమ్ముప్రశంస సేయఁగను
గబ్బములన్నవి యెల్లఁగాలగ
ర్భమ్మునరూపడెన్ ; నిజము ;
భాగ్యవశమ్మున నెల్లగ్రంథరా
జమ్ములునుండినన్ గవితఁ
జక్కగ నీవలె వ్రాయనేర్తురే ?

ఉ॥ వాగను శాసనుండవయి
భారత సంహిత తెల్గుసేతనీ
వేగతి చేసినాడవో ? య
హీనగతిన్ రసబంధురమ్ముగా ;
ఆగమవేత్త వాడికవి
వక్షరరమ్యత నీదుసొమ్ము ; భా
షాగహనాంధ కారమున
శాశ్వత తేజమవీవునన్నయా !

## నెహ్రూకు ఏలూరు బాలల

### శ్రద్ధాంజలి

నెహ్రూ జన్మదినోత్సవం రోజున ప్రపంచబాలల దినోత్సవంగా పరిగణించిన సందర్భమును పురస్కరించుకొని ఏలూరు బాలానందం (మహిళాశాఖ) వారు ఉత్సవమును అతివైభవముగ ఉ॥ గం॥ 7 నుండి రాత్రి గం॥9 వరకు జరిపిరి. ఉదయం గం॥ 7॥లు అగుసరికి పట్టణం నలుదిశలు వేలాది బాలబాలికలు జిల్లా కాంగ్రెసు భవనమువద్దకు రాసాగిరి. ఉ॥ గం॥ 8లకు బాలల జయ జయధ్వానములమధ్య చి॥ కె. రాంబాబు జాతీయ జండాను ఎగురవేసెను. శాంతిసూచకముగ తెల్లని పావురములు ఆకాశములో ఎగురవేయబడినవి. బాలలనుద్దేశించి అధ్యక్షురాలు శ్రీమతి మూల్పూరి చుక్కమ్మగారు నాటి ఉత్సవకారణములు వివరించుతూ మాట్లాడిరి.

నెహ్రూజీ చిత్రపటమును బ్రహ్మాండముగ ఊరేగించుతూ 15000 వేలమంది బాలబాలికలు దిక్కులు పిక్కటిల్లేటట్లు జయ జయధ్వానములతో, ముఖ్యపురవీధులగుండా సాగి ఏలూరు శ్రీ పాండురంగ టాకీసువద్దకు చేరిరి. అచ్చట పాండురంగటాకీసు మానేజరు శ్రీరామచంద్ర రావుగారు ఇండియా గవర్నమెంటువారి బాలల చిత్రములను మూడుపార్లుగ, ఉచితముగా చూపిరి.

సాయంత్రము గం॥ 5 లకు జిల్లాకాంగ్రెసు భవనము వద్ద గొప్ప బహిరంగ సభ జరిగినది. సభకు డా॥ శ్రీ మూల్పూరి రంగయ్య యమ్. యల్. ఎ. గారు అధ్యక్షత వహించిరి. ప్రముఖులనేకులు ప్రసంగించిరి. శ్రీ బి. వి. నరసింహారావుగారు సంగీతోపన్యాసముతో సభను రంజింపజేసిరి. తదుపరి బాలానందం, బాలభారతి బృందమువారి, సంగీతనృత్య. నాట్య ప్రదర్శనములుజరిగినవి.

ఆంధ్రమహిళా సభలో యావజ్జీవ సభ్యులుగా శ్రీమతి బి. శేషమ్మగారు అని ఉండుటకు బదులు పొరపాటున శ్రీమతి విజయలక్ష్మిగారు అని గత సంచికలో ప్రకటింపబడినది. సవరించుకొనప్రార్థన. సం

# అశ్రువర్షం

శ్రీ శ్రీనివాసపుపురం రామాచార్యులు

ఆరోజు దీపావళి! ఎక్కడచూచినా ఆనందం నృత్యం చేస్తోంది!! వేకువఝామునుంచీ, పిల్లలు కాల్చుతున్న పలువిధాలైన టపాకాయల ధ్వనులు, ప్రపంచ యుద్ధంలోని-బాంబులు; మరఫిరంగుల్లా, గాలినిచీల్చుకుని దిగంతాలవరకూ వ్యాపిస్తున్నాయ్! చీకటిపడేవరకూ ఓపికపట్టలేక, మధ్య మధ్య- చిచ్చుబుడ్లు; కాకర పువ్వొత్తులు; మతాబాలు వగైరాలు వెలిగిస్తున్నారు. అరుణ కాంతిలో వాటి వెలుగులు అస్పష్టంగా అపుపిస్తున్నాయ్! ముత్యాల రంగవల్లుల ముంగిళులతో, వీధులు వింతకళలు తేరుతున్నాయ్! పిల్లల సంతోషానికి అంతులేదు! అసలు వాళ్ళదేగా! ఆపండుగంతా! వారి అమాయకపు ఆనందమే ఆపండుగ.

తమ జీవితాల్ని దరిద్రదేవత కంకితము చేసిన దీన బిక్షువులుగూడా ఆరోజు కడుపునిండుగా అన్నందొరుకుతుందన్న ఆశతో ఆనందాన్ని ప్రకటిస్తున్నారు.

కానీ ఆ ఆనంద మనుభవించే భాగ్యం ఆనాడు ఒక జీవి మాత్రంనోచుకోలేదు! ఆ జీవి చంద్రమ్మ ....
- ఆమె హృదయంలో వేదనాగ్ని రగులుతూ- రాజుతూవుంది. భరింపరాని ఆవేదనకు రక్తనాళాల్లోని రక్తం ఒక్కసారివేడెక్కి, విద్యుత్ప్రవాహంలా శరీరంయావత్తు ప్రవహించ సాగింది. ఆరోజు చంద్రమ్మ యమయాతన అనుభవిస్తోంది! ఆమె కన్నులకు అంధకార మలుముకు పోయినట్టు కన్పించింది.

ఆమె తన బాధను ఎవరితోనైనా చెప్పి ఒక్కమారు గట్టిగా యేడిస్తే, కన్నీళ్ళతో సహా ఆబాధ కొట్టుకుపోయి హృదయం తేలిక పడుతుందనుకుంది. కాని యేడ్వటానికి కంటిలో తడిలేదు! ఈనాటికి అవియెండి పోయి సంవత్సరమైంది.

టపాకాయల ధ్వనులు చెవుల్లోదూరి గింగుర్లెత్తిస్తూనే వున్నాయ్! పిల్లలు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. ఇంకొందరుపిల్లలు కుక్కతోకకు చిన్నటపాకాయలసరాలు కట్టి; అంటించి వదిలేస్తున్నారు! ఉండుండి, ఆ టపాకాయలుఒక్కొక్క పేలినప్పుడు కుక్క 'కంయ్' మంటూ తోకవిదిలించుకునిపారిపోతోంది. పిల్లలుఅరుస్తూ రొజుతూ దానివెనకాలే పడి దాన్ని గాభరాపట్టిస్తున్నారు. చంద్రమ్మ ఈ దృశ్యాల్నిచూచి కుమిలి కుమిలియేడ్చి, తన పాపిష్టి కన్నులతో ఇక ఆపిల్లల ఆనందాన్ని చూడలేక ముఖాన్ని చేతులతో కప్పుకుని తలొంచుకుంది.

క్రిందటి సంవత్సరం చంద్రమ్మ దీపావళీ పండుగ త్వరలోనే వచ్చేస్తూవుందన్న సంబరంతో వారం రోజులు ముందునుంచీ- ఇల్లూ, వాకిలీ చక్క బెట్టుకునే పనుల్లో మునిగివుంది తను, తనభర్త, తనమురళి యీతూరి పండుగకు గొప్పగా స్వాగతమివ్వాలనీ, ఆరోజంతాహాయిగా ఆనందంగా గడిపేయాలని అనుకుంటోంది ఇంతలో—

"అమ్మా! తపాకాయలు లామిగాడు తెత్తుకున్నాడు. నాకుగూలా తెత్తియివ్వవూ?" అంటూ, బయటనుంచీ వొచ్చి తల్లికొంగు పట్టుకులాగుతూ అడిగాడు, ఐదేళ్ళ కొడుకు మురళి, సగం వచ్చీరాని మాటలతో.

"ఇప్పుడే యెందుకు బాబూ! దీపావళి యింకా వారం రోజులుందిగా?" బుజ్జగించింది తల్లి!

"ఇప్పులే కావాలి అమ్మా!" లామిగాణ్ణి అడిగితే ఛోలా! అన్నాదు! నాకు తెత్తియివ్వవూ? నేను కాల్తుకోవాలి!" అని అడిగాడు మళ్ళీ, తల్లి కొంగు లాగుతూ గోముగా!

"సాయంత్రం మీనాన్న ఆఫీసునుంచి రాగానే తెమ్మంటానులే! బాబూ ఇప్పుడు నేనెక్కడికిపోను చెప్పు మీ నాన్న వచ్చేలోగా బువ్వ చేయాలి! కొంగువొదిలిపెట్టు బాబూ! మానాన్నకదూ!.

ససేమిరా వాడు వినలేదు! పైగా తల్లికొంగు యింకా బలంగా లాగుతూ "ఇప్పులే కావాలి ఇప్పులే కావాలి"! అని మొండిపట్టు పట్టాడు.

"అలాగే! యిప్పుడే తెమ్మంటాను. మీ నాన్నవచ్చే వరకూ కాస్తవోపిక పట్టుబాబూ!" అంది తల్లి వాడితల నిమురుతూ.

"ఉహూ నాన్నొత్తేవలకూ వుండను నువ్వే తీతుకులా!" అని మారాం చేయసాగాడు

వాణ్ణి సముదాయించటం ఆమెకు తలకు మించిన పనైంది. ఏమేమో చెప్పిచూచింది. చివరికి వినకపోయేప్పటికి కోపంవచ్చి నాలుగు తగిలించింది. మురళి గుక్కపట్టి యేడుస్తూ అలానే తల్లి ఒడిలోపడి నిద్రపోయాడు. "అయ్యో! కోపంవచ్చి పిల్లాణ్ణికొట్టానే!" అని పశ్చాత్తాప పడింది చంద్రమ్మ ఆమె శరీరానికేదో వేడిగా తగిలినట్టయింది మురళినుదుటిమీద చేయివేసిచూచింది. నుదురు కాలి పోతోంది ఆమె గాభర పడసాగింది. రెండు రోజుల్నుంచీ కొద్దిగా వస్తూన్నజ్వరం యీరోజు ఎక్కువైంది. పిల్లాణ్ణి మెల్లిగాఎత్తుకెళ్ళి పరుపుమీద పడుకోబెట్టి దుప్పటి కప్పింది. వాడికి జ్వరం తగుల్తూన్న సంగతే మరచి పోయింది. తనుకొట్టినందుకే భయపడిమళ్ళీ యీ జర్వం తగిలిందేమోనని బాధ పడసాగింది.

భావనారాయణ ఆఫీసునుంచి వచ్చాడు. బట్టలుగూడా మార్చక మునుపే "చంద్రా! చంటివాడెక్కడ? కన బడ లేదే: ఆడుకోటానికెళ్ళాడా? వాడికీపూట యెలావుంది?? జ్వరం తగుటలేదుకదా?" అనిప్రశ్నలవర్షం కురిపించాడు.

జరిగిన విషయం చెప్పి చంద్రమ్మ కళ్ళల్లో నీళ్ళు పెట్టుకుంది.

"ఏపిటిచేశావే చంద్రా! వాణ్ణిసముదాయించటం నీచేత కాలేదూ? అని గబ, గబా గదిలోకి వెళ్ళాడు. ?"

"ఏమండీ! ఎక్కువగానే కాస్తోందా జ్వరం?" భర్త వెనకాలే వచ్చి అడిగింది చంద్రమ్మ.

"ఎక్కువగానే కాస్తోంది. ఒకసారి వెళ్ళి శేషాచలం గారిని పిల్చుకువస్తాను.

డాక్టరు శేషాచలం పిల్లాణ్ణి పరీక్షచేశాడు.

"అబ్బే! ఏమిలేదు కొద్దిగా జ్వరం కాస్తూ వుంది. మరేం భయపడవలసిన పనిలేదు. మందు యిస్తాను." అని డాక్టరు వెంటతెచ్చిన మందు ఏదో యిచ్చాడు.

ఐదు రోజులు గడిచి పోయాయి రోజు రోజుకు మురళికి జ్వరతీవ్రత యెక్కువౌతోంది. కాని, తగ్గట లేదు! ప్రతిరోజూ డాక్టరు మందులిస్తూనే వున్నాడు. చంద్రమ్మ మురళి మంచం వదలి ఒక్క క్షణమైనా ఉండలేక పోతోంది "బాబూ! ఎలావుందీ?" అని ప్రతినిమిషానికీ అతని నుదుటిపైన చేయిపెట్టి అడుగుతుంది దానికి జవాబుగా మురళి పిచ్చిచూపులు చూచి ఊరుకుంటాడు

ఆ రోజు సాయంత్రం యింటికొస్తూనే, మురళి మంచంవద్దకెళ్ళి "ఏంబాబు! ఎలావుందీ?" అన్నాడు. భావనారాయణ.

"నాకు తపాకాయలు కావాలినాన్నా."

"ఈ ఒక్క రోజు ఓపిక పట్టుబాబు! నీకు కొత్త చొక్కా — లాగూ, టపాకాయలు, కాకరపువ్వొత్తులు, మతాబాలు, అన్నీ తెచ్చియిస్తాను" అని అన్నాడు.

మురళి తిరిగి ఏమీ మాట్లాడలేదు.

"అ...మ్మా!" — అని మూల్గాడు. మురళి.

"భర్తకు అన్నం వడ్డిస్తూన్న చంద్రమ్మ పరుగెత్తు కొచ్చి—"ఏంబాబు?" అంది.

"నాకు తపాకాయలు కావాలే!....

"ఊరికే మాట్లాడితే ఆయాసం ఎక్కువౌతుంది బాబు! .... రేపు మీ నాన్నను తెచ్చి యివ్వమంటానులే"—

"నువ్వు ఊలికేనే చెబుతున్నావ్! అన్నీ అబద్దాలే."

"లేదు బాబు! తప్పక రేపు తెమ్మంటాను"

ఆ మర్నాడు మురళికి జ్వరంతీవ్రంగా తగిలింది. మతిస్పృహలోలేడు. ఆయాసం యెక్కువైంది. బాధగా మూల్గుతున్నాడు. "అమ్మా! ... తపాకాయలు ... తెమ్మని.... నాన్నకు.... చెప్పవూ?.... ఫో.... ఫో... నువ్వు యెప్పు.... డూ.... ఇం... తే" —అని పలవరిస్తున్నాడు. డాక్టరు వచ్చాడు. మురళిని పరీక్షచేశాడు.

మురళి పరిస్థితి నిమిష నిమిషానికీ, మరీ యెక్కువౌతోంది. మందులు—మాకులు ఏంపని చెయ్యలేదు! మూల్గులు, పలవరింతలు యెక్కువౌతున్నాయి. కాళ్ళు, చేతులు చల్లబడి పోతున్నాయి! చంద్రమ్మకు, భావనారాణయకు కంగారెక్కువైంది.

"అ....మ్మా! త పా కా"— అంటూ, మురళి శాశ్వతంగా కన్ను మూశాడు. చంద్రమ్మ, భావనారాయణ అతనిపైబడి గొల్లుమన్నారు.

వాళ్ళకి తరవాత ప్రతీ దీపావళీ అంధకారమే. పాట కాయ ప్రేలినప్పుడల్లా వాళ్ళ గుండెలు బ్రద్దలౌతాయి.

## తెలుగు విజ్ఞాన సర్వస్వమునకు కేంద్ర ప్రభుత్వ బహుమానము.

భారత ప్రభుత్వపు సమాచార ప్రచార, ప్రసారశాఖా మంత్రిత్వమువారు ప్రాంతీయ భాషలలో హిందూ దేశములో తయారైన కాగితముమీద ముద్రితమై ప్రకటితమైన తెలుగు విజ్ఞాన సర్వస్వము, "భౌతిక–రసాయన శాస్త్రముల" సంపుటమునకు రూప కల్పన యందలి విశిష్టతకుగాను బహుమానమునిచ్చి యున్నారు.

ముద్రణమునకు కూడ ఇటువంటి బహుమానమునే పైనుదహరించిన "భౌతిక–రసాయన శాస్త్రముల" సంపుటమును ముద్రించినందుకుగాను హిందీప్రచార ముద్రణాలయమునకు ఇచ్చియున్నారు.

తెలుగు భాషా సమితి.

Regd. No. 4759

"To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood"

## డిశంబర్ 1956

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 30 | 31 | • | • | • | • | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |

2. సూర్యగ్రహణం. 8. సుబ్రహ్మణ్యషష్ఠి. 15. ధనుర్మాసారంభం. 25. క్రిస్మస్.

**ANDHRA MAHILA SABHA**

MYLAPORE : : MADRAS 4

Edited, Printed & Published by Mrs. K. Lakshmi Raghuram, B.A.,